JANA SAINYAM

జనసైన్యం

ప్రజల పక్షం జనసైన్యం

తెలుగు దినపత్రిక

కరీంనగర్ జిల్లా. సంపుటి 3. సంచిక 303 22 సోమవారం జూన్ 2026 ఎడిటర్ గుంటపల్లిస్వామి https://epaper.janasainyam.in పేజీలు: 12 రూ.5

ప్రపంచ శ్రేయస్సుకు యోగా

హుస్నాబాద్‌లో యోగా చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్లో యోగా చేస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్

ప్రయాణికులకు తప్పిన పెను ప్రమాదం.

జనసైన్యం సిటి

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరు శివారులో ఆదివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) కి చెందిన ఒక (జేబీఎం) ఎలక్ట్రిక్ బస్సులో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. బస్సు కరీంనగర్ నుండి హైదరాబాద్కు 41 మంది ప్రయాణికులతో బయలుదేరిన కొద్దిసేపటికే ఈ ప్రమాదం సంభవించింది.

సమయస్ఫూర్తితో ప్రాణాలు కాపాడిన డ్రైవర్.. బస్సు అలుగునూరు సమీపంలోకి రాగానే ఒక్కసారిగా దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమయ్యాడు. రోడ్డు పక్కన బస్సును ఆపి, ప్రధాన ద్వారంతో పాటు ఎమర్జెన్సీ గేట్లను ఓపెన్ చేసి ప్రయాణికులందరినీ కిందకు దించేశాడు. ప్రయాణికులు కిందకు దిగిన క్షణాల్లోనే బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఉవ్వెత్తున ఎగసిపడి బస్సు మొత్తానికి వ్యాపించాయి.

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా కాలిబూడిదై కేవలం అస్థిపంజరంలా మిగిలింది. డ్రైవర్ సరైన సమయంలో స్పందించడం వల్ల 41 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో ఒక పెద్ద ప్రమాదం తప్పిందని, దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

హెల్త్ స్కీమ్ నూతన మార్గదర్శకాలు వెంటనే విడుదల చేయాలి

జనసైన్యం సిటి
ఉద్యోగ, పెన్షనర్ల హెల్త్ స్కీమ్‌కు సంబంధించిన నూతన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం అశోక్, గౌరవాధ్యక్షుడు కట్ట నాగభూషణ చారితో కలిసి విడుదల చేసిన ప్రకటనలో వారు ఈ మేరకు పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నప్పటికీ, ఉద్యోగులు, పెన్షనర్ల హెల్త్ స్కీమ్‌కు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయకుండానే సంబంధిత డీడీవో, ఎస్టీవోలకు సమాచారం ఇవ్వకుండా గత నెలలో ప్రీమియం కోతలు విధించడం సరైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌తో సమీక్ష నిర్వహించి, స్పష్టమైన విధి విధానాలను రూపొందించి తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.అదేవిధంగా, జూలై 2023 నుంచి అమలు కావాల్సిన నూతన పీఆర్సీ నివేదికను ఇప్పటివరకు ప్రకటించకపోవడం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే పీఆర్సీ నివేదికను విడుదల చేసి, జూలై 2023 నుంచే కొత్త పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలన్నింటినీ విడుదల చేయడంతో పాటు, పెండింగ్ బిల్లులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టాప్రా నాయకులు మరోసారి కోరారు.

తెలంగాణ పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్

జనసైన్యం సిటి
తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఈరోజు నగరంలో జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.తెలంగాణ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఇచ్చిన భాగస్వామ్యం చాలా గొప్పదని వారి స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం అని వారు అన్నారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధనలో వారి జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు జయశంకర్ సార్ అని అన్నారు. స్వరాష్ట్రం కోసం ఎంతోమంది విద్యార్థులను, యువకులను, మేధావులను, ప్రజలను చైతన్య పరిచి తెలంగాణ ఉద్యమకారులను సిద్ధం చేసి స్వరాష్ట్ర సాధనలో తనవంతు పాత్ర పోషించాడని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యకల తిరుపతి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు శ్రీరాముల రమేష్, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, మహిళ విభాగం సీనియర్ నాయకురాలు జంగా అపర్ణ సాగర్ సీనియర్ నాయకులు గాలిపెల్లి రత్నాకర్ చారి, జిల్లా యువజన విభాగం నాయకులు నూతి సాయిచరణ్ పూసాల పవన్, సంతు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సంఘం మరియు యువజన సంఘం ఏకగ్రీవ ఎన్నిక

జనసైన్యం సిటి
రాముడు మండలం గోపాల్ రావు పేట గ్రామంలో పద్మశాలి సేవా సంఘం మరియు యువజన సంఘం ఎన్నికలను సంఘం ఆవరణ లో నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికలను ఎన్నికల అధికారిగా జిల్లా పద్మశాలి నాయకులు లయన్స్ క్లబ్ గవర్నర్ మోర భద్రేశం గారి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ ఎన్నికలలో పద్మశాలి సేవ సంఘం అధ్యక్షులుగా కొలిపాక మల్లయ్య ఉపాధ్యక్షులుగా కొలిపాక మల్లేశం ప్రధాన కార్యదర్శిగా కొలిపాక కమలాకర్ కార్యనిర్వహక కార్యదర్శిగా రాంపల్లి శ్రీనివాస్ సంయుక్త కార్యదర్శిగా మచ్చ గంగయ్య కోశాధికారిగా సిరిపురం మల్లేశం కార్యవర్గ సభ్యులుగా నల్ల శ్రీనివాస్ కొలిపాక నాగరాజ్ కొలిపాక లక్ష్మణ్ అలువాల శంకర్ ఎన్నిక అయినారు. పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులుగా అలువాల విష్ణు ఉపాధ్యక్షులుగా కొలిపాక శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా రుద్ర నాగరాజ్ కార్యనిర్వహక కార్యదర్శి గా మామిడాల నాగరాజ్ సంయుక్త కార్యదర్శిగా అలువాల గంగాధర్ కోశాధికారిగా కొలిపాక ప్రవీణ్ కార్యవర్గ సభ్యులుగా కొలిపాక కమలాకర్ ఎలిగేటి మహేష్ గోనె రమేష్ ఎలిగేటి మహేష్ ఏన్నం రామాంజనేయులు సంఘం ఎన్నిక అయినారు. సలహాదారులుగా సిరిపురం సత్యనారాయణ మచ్చ లచ్చయ్య అలువాల సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొనడం జరిగింది.

యోగాతో ఆరోగ్య సంపద

ప్రపంచానికి భారతదేశం అందించిన అమూల్యమైన ఆరోగ్య సంపద యోగా అని జిల్లా క్రీడలు యువజన అధికారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో డివైఎస్ఓ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అత్యంత విలువైన ప్రాచీన వారసత్వమని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానానికి ప్రతీకగా నిలిచిన యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది జీవితాల్లో భాగమైందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో యోగాకు లభిస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణమన్నారు.యోగాను దినచర్యలో భాగంగా చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రస్తుత జీవనశైలి మార్పుల కారణంగా వెన్నునొప్పి, మెడనొప్పి, మోకాళ్ల నొప్పులు, రక్తపోటు, మధుమేహం వంటి అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి సమస్యలను నివారించడంలో యోగా, ప్రాణాయామం, ధ్యానం కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.యోగా సాధనకు ప్రత్యేక పరికరాలు, ఖరీదైన జిమ్‌లు లేదా పెద్ద ప్రదేశాలు అవసరం లేదని, ఇంట్లోనే కొద్దిపాటి స్థలంలో ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి యోగా చేయవచ్చని చెప్పారు. ముఖ్యంగా మహిళలు, కుటుంబ సభ్యులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.వయస్సుతో సంబంధం లేకుండా క్రమశిక్షణతో యోగా సాధన చేస్తే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.విద్యార్థులకు యోగా, ప్రాణాయామం, ధ్యానం ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ, అనులోమ-విలోమ, భ్రమరి వంటి

జనసైన్యం సిటి

ప్రాణాయామాలు ఏకాగ్రతను పెంపొందించడంతో పాటు చదువులో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడతాయని తెలిపారు. కరోనా తర్వాత యోగాకు మరింత ప్రాచుర్యం లభించిందని తెలిపారు. ప్రతి విద్యార్థి రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ఆసనాలు ఆకట్టుకున్నాయి. అనంతరం రాష్ట్ర జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు టి.రమేష్ రెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కన్న కృష్ణ , గుంటి రామకృష్ణ, 'పెటా' అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, యోగా కోచ్ లు వి.కిష్టయ్య, మల్లికా , పి స్వరూప చారి కోటేశ్వరరావు ఆనంద కిషోర్ ప్రశాంత్ రాజమౌళి వీణ వాణిజిల్లా స్పోర్ట్స్ అథారిటీ కోచ్ లు వ్యాయామ ఉపాధ్యాయులు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

శారీరక మానసిక ఆరోగ్య సంరక్షణకు నిత్య యోగాభ్యాసం చేద్దాం

లయన్ లింగరాజు కోదండరామ్, లయన్ జిల్లా గవర్నర్

జనసైన్యం సిటి
సనాతన భారతం ప్రపంచ మానవాళికి అందించిన అపూర్వ వరం సంపూర్ణ ఆరోగ్య సాధనం యోగా అని, దానిని నిత్యం పాటించడం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని లయన్ జిల్లా గవర్నర్ లయన్ లింగరాజు కోదండరామ్ అన్నారు. ఈ కృరోజు 320జీ జిల్లా పక్షాన కరీంనగర్‌లో పెద్ద ఎత్తున నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇంటింటా యోగా, ప్రతి రోజు యోగా అనే నినాదంతో ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలని కోరారు. షిరిడి సాయి యోగా కేంద్రం, భాగ్యనగర్ బాధ్యులు యోగా గురు రాళ్లబండి శంకరప్రసాద్? రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వయసు తేడా లేకుండా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు యోగాసనాలు వేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. జీవనశైలి రుగ్మతలకు దివ్య ఔషధం యోగా అని విశ్వసించాలని అన్నారు. యగా దినోత్సవానికి సమన్వయ కర్తగా వ్యవహరించిన లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ దినచర్యలో ఒక గంట వ్యాయామాలకు కేటాయించాలని సూచించారు. 2026 అంతర్జాతీయ యోగా దినోత్సవం ఇతివృత్తంగా వృద్ధుల ఆరోగ్యం కోసం యోగా అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా శంకర్ ప్రసాద్? రెడ్డి నాయకత్వంలో యోగా సాధకులు అద్భుతంగా యోగా విన్యాసాలు చేసి అందరి మన్ననలు పొందారు. యోగా వారోత్సవాల్లో నిర్వహించిన యోగా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిటి లయన్ గాలిపెల్లి వెంకట్, ఆర్‌సీ లయన్ సంపత్ కుమారి, జిఎల్‌టీ ఇనుగుర్తి రమేష్, వివిధ లయన్స్ క్లబ్బుల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చారిత్రక కట్టడానికి పూర్వ వైభవం

జనసైన్యం సిటి
మన్నెంపల్లి గ్రామంలో ఉన్న చారిత్రక బురుజులను కాపాడుకోవడం, వాటిని భావితరాలకు పరిచయం చేయడం కోసం బురుజు వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ చారిత్రాత్మక కట్టడాల అభివృద్ధి, సంరక్షణలో వివిధ స్వచ్ఛంద సంస్థలు, గ్రామ ప్రముఖులందరూ సహకరించి, భవిష్యత్తు తరాలకు మన చారిత్రాత్మక కట్టడాలు, సంస్కృతి, సాంప్రదాయాలను పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషించాలని గ్రామ పాలకవర్గ సభ్యులందరూ సహకరించాలని అభిప్రాయపడ్డారు.
స్వాతంత్ర్య, గణతంత్ర్య, తెలంగాణ ఆవిర్భావ వేడుకలు..
రానున్న జెండా పండుగలు అయిన స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15న, గణతంత్ర దినోత్సవం జనవరి 26న, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న నిర్వహించాలని నిర్ణయించారు. భవిష్యత్తులో గ్రామంలో నిర్వహించే సంస్కృతి, సంప్రదాయాల సంరక్షణలో వైభవకరమైన వాతావరణంలో గ్రామ వైభవాన్ని చాటే విషయంలో ఆ బురుజు ప్రాంతం

మొత్తం వినియోగంలోకి వస్తుంది. దీంతో ఇది మన్నెంపల్లి గ్రామానికి మాత్రమే కాకుండా కరీంనగర్ జిల్లాకు కూడా ఖ్యాతిని తెచ్చిపెడుతుంది. కాబట్టి, దీని అభివృద్ధికి గ్రామ ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, జిల్లాలోని ప్రముఖ నాయకులు సహకరించి, కీలక భాగస్వాములుగా మారాలని ప్రజలందరినీ ఆహ్వానిస్తున్నాం.చారిత్రాత్మక కట్టడాలను, మన జాతి సంపదను కాపాడటమే లక్ష్యంగా మన్నెంపల్లి గ్రామ సర్పంచ్ పొన్నం సునీత అనిల్ గౌడ్ ముందుకు సాగుతున్న విషయాన్ని గ్రామ ప్రజలందరూ అభినందించారు.

ప్రైవేట్ కళాశాలల దోపిడీని అధికారులు వెంటనే అడ్డుకట్ట వేయాలి

జనసేన పార్టీ నేత కాస రాజు

జనసైన్యం సిటి

కరీంనగర్ లోని కొన్ని బడా ప్రైవేట్ కళాశాలలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులను దోపిడీ చేస్తున్నాయని జనసేన పార్టీ నేత కాస రాజు తీవ్రంగా విమర్శించారు. ఒక తరగతి గదిలో 70-80 మంది విద్యార్థులను కుక్కిపెట్టి కనీస సౌకర్యాలు లేకుండా లక్షల రూపాయల ఫీజులు వసూలు చేయడం దారుణమని ఆయన అన్నారు. స్థానిక అర్హులైన లెక్చరర్లను నిర్లక్ష్యం చేస్తూ తక్కువ వేతనాలతో అధ్యాపకులను నియమించడం వల్ల విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి లాభాలకే ప్రాధాన్యత ఇస్తున్న కళాశాలలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలో ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీ, అధిక ప్రవేశాలు, అధ్యాపకుల కొరత, సౌకర్యాల లేమిపై సమగ్ర విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘిస్తున్న కళాశాలలను నియంత్రించాలని ఆయన కోరారు.

గోపు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం

శంకరపట్నం జన సైన్యం :

అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకొని ఆదివారం మండలంలోని కేశవపట్నం జడ్పీ హైస్కూల్లో యోగా గురువు గోపు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా పతాంజలి గురువుచే ప్రారంభమై భారత ప్రధాని నరేంద్ర మోడీ గారి చొరవతో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిందని, అమెరికా వంటి దేశాలలో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి డాక్టర్లు యోగా చేయాల్సిందిగా సూచిస్తున్నారని తెలిపారు. అలాంటి యోగాను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలని తద్వారా అనేకమైన ఆరోగ్య,మానసిక సమస్యలను అధిగమించవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి అంశాములపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు, మాజీ ఎంపిటిసి ఎనుగుల అనిల్, కేశవపట్నం ఉపసర్పంచ్ ఆకుపత్తిని విజయకుమార్, సీనియర్ క్రీడాకారులు వంగోజు సంపత్, బిజెపి నాయకులు కొయ్యడ అశోక్, దాసరపు నరేందర్, రాసమల్ల శ్రీనివాస్, బొజ్జ సాయిప్రకాష్, బిజిలి సారయ్య, గుర్రం శ్రీనివాస్, నరసయ్య కుమార్, శ్రీకాంత్ లతోపాటు యోగా అభిమానులు పాల్గొన్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో యోగా డే కార్యక్రమం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు ఉదయం కరీంనగర్ మానేర్ డ్యాం కట్ట పక్కన ఓపెన్ జిమ్ వాకింగ్ ట్రాక్ వద్ద వాకర్స్ అందరిచే యోగా డే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో యోగా గురువులు మర్రి రాజేందర్, జగదీశ్వర్, కటకం శ్రీనివాస్ ,ముసుకుల రఘు శంకర్ రెడ్డి, గార్ల సమక్షంలో వాకర్స్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని అందరూ యోగ అభ్యసించారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు ముఖ్య అతిథిగా విచ్చేశారు. యోగా అనేది నేడు ఒకరోజు కాకుండా ప్రతిరోజు చేస్తే అందరికీ ఆరోగ్యంగా ఉంటుందని సూచించారు యోగాభ్యాస కార్యక్రమం అనంతరం కరీంనగర్ డైరీ వారు అందించిన బాదం మిల్క్ బిస్కెట్ స్నాక్స్ వాకర్స్ అందరూ స్వీకరించారు. కరీంనగర్ డైరీ యాజమాన్యానికి మానేరు వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు.

యోగా దైనందిక జీవితంలో భాగం కావాలి

జనసైన్యం సిటి

యోగా మన దైనందిక జీవితంలో భాగం కావాలని మహబూబాబాద్ సబ్ జైలు జైలర్ మల్లెల శ్రీనివాసరావు అన్నాడు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గత పక్షం రోజులుగా జైల్లో యోగా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా మల్లెల శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశం ప్రపంచానికిచ్చిన గొప్ప ఆరోగ్య వరం యోగ అని పేర్కొన్నాడు. యోగాభ్యాసం ద్వారా మానసిక ప్రశాంతత, శరీర దారుఢ్యంతో పాటు రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందన్నాడు. తద్వారా మనిషి ఆరోగ్యకర పరిపూర్ణమైన జీవితాన్ని అనుభవిస్తాదన్నాడు. అనంతరం యోగా గురువు ఉమ్మగాని అరుణ్ కుమార్ కు జైలు డిపార్ట్మెంట్ తరపున మెమెంటో శాలువతో ఆత్మీయ సన్మానం నిర్వహించారు..ఇంకా ఈకార్యక్రమంలో సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్ రామరాజుతో పాటు జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

ఆహార భద్రత కోసం వర్షారణ్యాలు

ఆచార్య : మధుసూదన్ రెడ్డి బుర్ర

(జూన్ 22న "ప్రపంచ వర్షారణ్య దినోత్సవం" సందర్భంగా)

వర్షారణ్యాలు దట్టమైన పచ్చని అడవులు, వీటిలో చెట్ల పందిరి పరిచినట్లు నిరంతరాయంగా ఉంటుంది. మొత్తం అడవి తేమపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. వర్షారణ్యాలలో కార్చిచ్చులు సంభవించవు. వర్షారణ్యాలలో వృక్షజాలం, శిలీంధ్రాలు, వృక్షోపజీవులు, లతలు, దట్టమైన పందిరిని ఏర్పరిచే చెట్లు కనిపిస్తాయి. ప్రపంచ వర్షారణ్య దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 22న జరుపుకుంటారు. వర్షారణ్యాల ప్రాముఖ్యత గురించి - అవి ఎందుకు ముఖ్యమైనవి, భవిష్యత్ తరాల కోసం వాటిని రక్షించడం, పరిరక్షించడం యొక్క ఆవశ్యకత, వాటిలో నివసించే జీవ వైవిధ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం దీని లక్ష్యం. అటవీ నిర్మూలన, అక్రమ మైనింగ్, కలప అక్రమ నరికివేత వంటి ముప్పుల నుండి ఈ కీలకమైన పర్యావరణ వ్యవస్థలను రక్షించుకోవాలని ఈ రోజు గుర్తు చేస్తుంది.

ప్రపంచ వర్షారణ్యాల దినోత్సవం-2026 ఇతివృత్తం :

2017లో స్థాపించబడిన ప్రపంచ వర్షారణ్య దినోత్సవం, వాతావరణం, జీవవైవిధ్యం, సంస్కృతి, జీవనోపాధుల కోసం ఆరోగ్యకరమైన, నిలకడగా ఉన్న వర్షారణ్యాల ప్రాముఖ్యతను చాటి చెప్పడంతో పాటు వాటిని రక్షించడానికి, పునరుద్ధరించడానికి ఒక ప్రపంచ ఉద్యమాన్ని సమావేశపరుస్తుంది. ప్రపంచ వర్షారణ్య దినోత్సవం-2026 యొక్క ఇతివృత్తం "మీలోని అడవి (ఫారెస్ట్ విథిన్ యూ)", ఇది ఆహార భద్రత, పోషణ, సారవంతమైన నేల, వాతావరణ నియంత్రణ, జీవవైవిధ్య పరిరక్షణ, జీవనోపాధిని అందించడంలో వర్షారణ్యాల కీలక పాత్రను నొక్కి చెబుతుంది. మనం మన ప్రకృతిలో ఒక భాగమని, ఈ కీలకమైన పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించడానికి తీసుకునే ప్రతి చర్య మన శ్రేయస్సును నిలబెట్టడంలో సహాయపడుతుందని గుర్తించేలా ఈ ఇతివృత్తం ప్రజలను ప్రోత్సహిస్తుంది.

వర్షారణ్యాల ప్రాముఖ్యత:

పక్షులు, జంతువులు, మొక్కలు, క్షీరదాలు, సరీసృపాలు, అకశేరుకాలు, ఉభయచరాలు, చెట్లు వంటి చాలా జీవులు వర్షారణ్యాలకు స్థానికమైనవి. వర్షారణ్యాలు మానవులకు మంచినీటికి ఒక ముఖ్యమైన వనరు. అవి కార్బన్ డయాక్సైడ్‌ను కూడా గ్రహించి, వాతావరణ మార్పుల ప్రభావాల నుండి భూమిని కాపాడతాయి. అవి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఒక ముఖ్యమైన సహజ వనరు. ఈ ప్రయోజనాలతో పాటు, మన దైనందిన జీవితంలో మరియు తయారీలో ఉపయోగించే అనేక పదార్థాలు ఈ అడవుల నుండి లభిస్తాయి. కలప, మాంసం, జంతు ఉత్పత్తులు, మొక్కల ఉత్పన్నాలు, పర్యాటకం కూడా వర్షారణ్యాలు అందించే ఇతర ప్రయోజనాలలో ఉన్నాయి.

ప్రపంచ వర్షారణ్య దినోత్సవం యొక్క 10వ వార్షికోత్సవం, వర్షారణ్యాలు కేవలం పర్యావరణ వ్యవస్థలు మాత్రమే కాదని, అవి మన దైనందిన జీవితాలు, సంస్కృతి, ఆరోగ్యం, వాతావరణంతో కూడా ఎంతగానో ముడిపడి ఉన్నాయని నొక్కి చెబుతోంది.

సిద్ధార్థ విద్యా సంస్థల ఆధ్వర్యంలో యోగా దినోత్సవం మరియు ఫాదర్స్ డే వేడుకలు

జనసైన్యం సిటి

IVY (CBSE) మరియు సిద్ధార్థ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఈషా ఫౌండేషన్ సహకారంతో ఘనంగా యోగా దినోత్సవం , మరియు ఫాదర్స్ డే వేడుకలు ....

ఈ షా స్ఫూర్తితో IVY లో ఆరోగ్యోత్సవం , ఒకే వేదికపై యోగ సాధన ...ఫాదర్స్ డే వినూత్న కార్యక్రమాలు ....

యోగాసనాల ఉత్సాహం తండ్రుల చిరునవ్వుల సందడి , ×వ్ లో ప్రత్యేక వేడుకలు .....కరీంనగర్ సీతారాంపూర్ లోని ×వ్ విద్యా సంస్థల, మరియు సిద్ధార్థ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఈ షా ఫౌండేషన్ సహకారంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం మరియు ఫాదర్స్ డే వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి .ఈ కార్యక్రమానికి పాఠశాల వ్యవస్థాపకులు పసుల మహేష్ , కో చైర్మెన్ శ్రీ దాసరి శ్రీపాల్ రెడ్డి , డైరెక్టర్ం పసుల జయ శ్రీ , స్వప్న,, ప్రిన్సిపల్ లలిత ,, ఈషా ఫౌండేషన్ గురువుల సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు . ఈ సందర్భంగా ఈ షా ఫౌండేషన్ గురుకులానికి చెందిన హఠ యోగ శిక్షకులు పృధ్వి గారు , ప్రణవి గారు ఓంకారంతో ప్రారంభించి సూర్య నమస్కారాలు , భుజంగాసనం , వృక్షాసనం , త్రికోణాసనం , వజ్రాసనం తడాసనం తదితర యోగాసనాలను అందరితో చేయించి వాటి వల్ల కలిగే శారీరక మానసిక ప్రయోజనాలను వివరించారు . విద్యార్థులు వారి తల్లిదండ్రులు , మరియు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని యోగాభ్యాసం చేశారు .ఈ సందర్భంగా ×వ్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు పసుల మహేష్ గారు , మరియు కో చైర్మన్ శ్రీ దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ నేటి వేగవంతమైన ప్రపంచంలో పిల్లలకు మార్కులతో పాటు మానసిక ప్రశాంతత కూడా అవసరం అని , ఆ ప్రశాంతతను అందించే గొప్ప సాధనం యోగ అని ప్రతిరోజు యోగా చేస్తే

శరీరం దృఢంగా మారి మనసు ప్రశాంతంగా ఉంటుందని , తద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని , ఆరోగ్యవంతమైన విద్యార్థులే రేపటి శక్తివంతమైన భారత దేశానికి పునాదులని , యోగ శరీరాన్ని నిలబడితే తండ్రి మన జీవితాన్ని నిలబెట్టి మనకు బాధ్యతను నేర్పిస్తాడని , మన ఆశలకు బలం ఇస్తాడని , మన భవిష్యత్తు కోసం శ్రమిస్తాడని ఈ రెండు కార్యక్రమాలు ఒకే వేదికపై జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు .అనంతరం ఫాదర్స్ డే సందర్భంగా విద్యార్థుల తండ్రుల కోసం పాఠశాల యజమాన్యం పలు వినోదాత్మక మరియు సృజనాత్మకత పోటీలు , ఆటలు నిర్వహించగా వారు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు . విజేతలకు పాఠశాల చైర్మన్ ఫాదర్స్ డే గుర్తుగా జ్ఞాపికలు అందజేసి అభినందించారు .యోగా సందేశం తో ఆరోగ్యాన్ని , ఫాదర్స్ డే సందేశం తో కుటుంబ విలువలను విద్యార్థులకు చేరవేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఇతరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కీర్తిశేషులు దారం నరసింహారెడ్డికి నివాళి

జనసైన్యం సిటి

కరీంనగర్: ఫాదర్స్ డే మరియు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కీర్తిశేషులు దారం నరసింహారెడ్డి (చిన్న సార్) మధుర స్మృతులను స్మరించుకుంటూ, వారి కుమారుడు దారం శ్రీనివాస్ రెడ్డి, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మరియు తెలంగాణ ఎన్జీవోల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు, తనకు జన్మనిచ్చిన తండ్రికి భావోద్వేగపూర్వకంగా నివాళులర్పించారు. గ్రామంలో అందరికీ "చిన్న సార్"గా సుపరిచితులైన దారం నరసింహారెడ్డి గారు ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థుల జీవితాలకు వెలుగులు నింపడమే కాకుండా, కుటుంబ సభ్యులకు క్రమశిక్షణ, కష్టపడే తత్వం, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన జీవన విధానం వంటి విలువలను అందించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "జీవితం వడ్డించిన విస్తరి కాదని, గమ్యం చేరాలంటే నిరంతరం శ్రమించాల్సిందేనని, కష్టం మనాధీనం -- ఫలితం దైవాధీనం అని మా నాన్నగారు ఎప్పుడూ బోధించేవారు. జీవితంలో ఎదురయ్యే అవరోధాలు, అవమానాలు, అపజయాలను ఎదుగుదలకు దారితీసే పరీక్షలుగా భావించాలని, పడిపోతే నిలబడడం, ఓడిపోతే గెలవడం నేర్చుకోవాలని చెప్పిన ఆయన బోధనలు నేటికీ నాకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి" అని పేర్కొన్నారు. భౌతికంగా దూరమైనా ఆయన నేర్పిన జీవిత పాఠాలు, విలువలు, ప్రేమ ఎప్పటికీ తనతోనే ఉంటాయని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా దారం నరసింహారెడ్డి గారు తరచూ చెప్పే "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే సందేశాన్ని గుర్తు చేసుకుంటూ ప్రజలందరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయుక్తమని, ఆరోగ్యంగా జీవించడం ద్వారా ఆనందకరమైన జీవితాన్ని గడపవచ్చని పేర్కొన్నారు. కీర్తిశేషులు దారం నరసింహారెడ్డి (చిన్న సార్) గారి ఆశయాలు, విలువలను ఆచరించడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొంటూ అందరికీ ఫాదర్స్ డే మరియు అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

జువ్వాడి కృష్ణారావు జన్మదిన వేడుకలు

జనసైన్యం సిటి

జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని డబ్బ,ఇబ్రహింపట్నం గ్రామలలో కాంగ్రెస్ పార్టీరాష్ట్ర పీసీసీ సీనియర్ నాయకులు,మాజీ ధర్మపురి దేవలయకమిటి అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు జన్మదినం సందర్భంగా అదివారం మిచ్చమ్మ చారిటబుల్ ట్రస్ట్ లో, డబ్బా గ్రామంలోని బుడిగ జంగం కాలనీలో చిన్న పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కృష్ణారావు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని నిరంతరం ఆయురారోగ్యాలతో ఉండి ప్రజలకు సేవలను అందిస్తు, ఉన్నత పదవులు పొందాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఇబ్రహింపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి , మార్కెట్ డైరెక్టర్,మాజీ ఉపసర్పంచ్ బుస రాజేశ్వర్ , మాజీ సర్పంచ్ లింగంపల్లి గంగాధర్, సీనియర్ నాయకులు దేశేట్టి జివన్, దుద్దుల లింగన్న తదితరులు పాల్గొన్నారు.

యువజన హక్కుల కోసం ఉద్యమిద్దాం.

జనసైన్యం సిటి

యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై, హక్కుల సాధనకై అనునిత్యం పోరాటాలు చేయాలని పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం రోజున అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) హుజురాబాద్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తలసమావేశం ఇందిరానగర్ లో పోలోజు రంజిత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు అన్ని వెంటనే భర్తీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ మాట తప్పిందని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని మేము వస్తే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల పైగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని మాట ఇచ్చి తప్పిన కాంగ్రెస్ పార్టీపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం గత 12 సంవత్సరాలకు పైగా యువతను మోసం చేస్తూ వస్తుందని ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ మాట ఎత్తకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఏటా కోటి ఉద్యోగాలన్న మోడీ నేటికీ దాని అమలు పరచకపోవడం సిగ్గుచేటు అన్నారు. వెంటనే యువజన వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని యువతకు పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్)రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్ల పెళ్లి యుగంధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు నెలకు 3000 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి మాట తప్పిందని ఆరోపించారు. గతంలో నిరుద్యోగులకు ఉపాధి చేసుకోవడం కోసం లోన్లు ఇచ్చి ఉపాధి కల్పించేవారని ఇప్పుడు ఆ పథకాన్ని పూర్తిగా నీరు కార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదివినటువంటి యువతకు ఉద్యోగం,ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా యువతను మరిచిపోయిందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కళ్ళు తెరిపించేందుకు అఖిల భారత యువజన సమాఖ్య కార్యకర్తలు ఉద్యమాలకు సిద్ధం కావాలని యుగంధర్ అన్నారు. ఏఐవైఎఫ్ ను హుజురాబాద్ నియోజకవర్గం లో గ్రామ గ్రామాన బలోపేతం చేసి ప్రతి గ్రామంలో యువతను ఐక్యపరచి సంఘటిత పోరాటాలకు సిద్ధం చేయాలని యుగంధర్ కార్యకర్తలను కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మాజీ జిల్లా నాయకులు రత్నాకర్,ఇూళ్ఖీ నియోజకవర్గ నాయకులు జెట్టి లావణ్య, మొడెం శివకుమార్, ప్రశాంత్, రాకేష్, మహేందర్, శివకుమార్, సదానందం, ఫర్జానా, రామంచ శ్రావణ్, అకినపల్లి సందీప్, కోల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ జిల్లా ప్రజలకు శుభవార్త

బ్యాడ్మింటన్ .
టేబుల్ టెన్నిస్ .చెస్
.క్యారం బోర్డు రంగంలో
ఆసక్తిగలవారికి గంటకు
300 రూపాయల చొప్పున
కోర్టును, బ్యాడ్మింటన్, టేబుల్
టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు ఆటకు
ఇవ్వబడును. ముందస్తు బుకింగ్
చేసుకున్న వారికి ఇవ్వబడును
బుకింగ్ చేసుకోవాల్సిన
ఫోన్ నెంబర్
9246966660

ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి
రాత్రి 10 గంటల వరకు

మన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .క్యారం బోర్డు. చెస్. వంటి క్రీడలను ఇప్పుడు మన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇవ్వబడును. నిపుణులైన కోచులచే బ్యాడ్మింటన్. టేబుల్ టెన్నిస్ .చెస్ .క్యారం బోర్డు వంటి క్రీడలలో శిక్షణ ఇవ్వబడును.కరీంనగర్ జిల్లా లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు నిపుణులైన కోచునులచే శిక్షణ ఇవ్వబడును.

ఆట వేళలు

ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు

ఇండోర్ స్టేడియం క్రీడాకారుల కోసం తెరిచి ఉంచబడును. కావున ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్థిని విద్యార్థులు శిక్షణ కోసం మరియు ఆట ఆడుకునే అందుకోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.9246966660

జనచిత్రం

హుస్నాబాద్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

హుస్నాబాద్ పట్టణ కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు కట్టపై మున్సిపల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని, స్వయంగా యోగాసనాలు వేశారు. సూర్య నమస్కారాలు చేయడం వల్ల శరీరం ఎంతో దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. సూర్య నమస్కారాలు మానవ శరీరానికి ఎంతో ఉత్తమమైనవని కొనియాడారు. పట్టణ కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు సూర్య నమస్కారాల భంగిమల (స్టాచ్యూస్) ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి "ఆరోగ్య హుస్నాబాద్ – ఆరోగ్య భారత్" నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యోగా మాస్టర్ అనిత అందరినీ మోటివేట్ చేస్తూ, ఆసనాలను చక్కగా వేయించడాన్ని అభినందించారు. యోగా చేయడానికి వయసుతో ఎలాంటి సంబంధం లేదని, ప్రతి ఒక్కరూ యోగాను తమ నిత్య జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే నినాదానికి తగ్గట్టుగా హుస్నాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమం ప్రజల్లో మంచి చైతన్యాన్ని నింపింది.

జనసైన్యం సిటీ



రన్నింగ్ కాలమ్

ఎక్కడినుండి వచ్చిందో
ఎత్కపోయిన ఎల్ నినో
కురవాల్సిన వర్షాలకు
చెబుతోందది నోనో

జూన్ నెల ఐపోతున్నా
పడకపోతే వాన
జనాల కడుపులకెలా
అందుతుంది దాణా

-పెనుగొండ బసవేశ్వర్..

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు.

జనసైన్యం సిటి

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భాగ్యనగర్ కు చెందిన మహిళలు యోగా దినోత్సవం స్థానిక సెయింట్ జాన్స్ హై స్కూల్లో వివిధ యోగ ఆసనాలతో ఘనంగా నిర్వహించారు.. అనంతరం వారు మాట్లాడుతూ ఈ యోగ ఆసనాల ద్వారా బీపీ షుగర్ థైరాయిడ్ వంటి అనారోగ్యానికి సంబంధించిన రోగాలు రావు.. ఈ ఆసనాల ద్వారా శరీరం ఫిట్నెస్ కూడా పెరుగుతుంది.. ఉల్లాసమైన ఆరోగ్యం పెంచుతుందని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు ఆర్ఎస్ఎస్ శంకరప్రసాద్ రెడ్డి గత 20 సంవత్సరాల నుండి ఉచిత యోగ నిర్వహిస్తున్నారు.. వీరికి భాగ్యనగర్ కాలనీ మహిళా మణులు ఈ యోగా డే సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్ లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం.

జనసైన్యం సిటి

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్‌లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై యోగా ఆసనాలను పరిశీలించి క్రీడాకారులను అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా మన శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని, నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం విశిష్టతను వివరిస్తూ యోగా ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక ప్రశాంతత పెరుగుతాయని పేర్కొన్నారు.తెలంగాణ ఒలింపిక్ సంఘం సభ్యులు సిలివేరి మహేందర్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి అమినిశెట్టి తిరుపతి లు మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి యోగా ఎంతో అవసరమని తెలిపారు. ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్ కోచ్, మాజీ భారత జట్టు ఖో ఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్ యాదవ్ ఆధ్వర్యంలో యోగా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు వెంకటేష్, రాజేష్, వాకర్స్ సంగం అధ్యక్ష కార్యదర్శులు సుమన్ , శ్రీనివాస్, ఖో ఖో క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం క్రీడాకారుల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు యోగా ప్రాముఖ్యతను మరింతగా చాటిచెప్పింది. అనంతరం ఖేలో ఇండియా ఖో ఖో సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్ కుమార్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

పవన్ కళ్యాణ్ ..తెలంగాణ గత చరిత్ర తెలుసుకో

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.

తెలంగాణ రాష్ట్రం ఏ రాజకీయ నాయకుడి దయాదాక్షిణ్యాలతోనో, ఏ పార్టీ ఎన్నికల హామీల ఫలితంగానో ఏర్పడలేదు. ఇది దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రజా పోరాటాల ఫలితం. వేలాది మంది యువత రక్తంతో, అమరుల త్యాగాలతో, విద్యార్థుల ఉద్యమాలతో, ఉద్యోగుల సమ్మెలతో, రైతుల నిరసనలతో, మహిళల భాగస్వామ్యంతో, దళిత-గిరిజన-బీసీ సమాజాల అంకితభావంతో నిర్మితమైన ప్రజాస్వామ్య ఆకాంక్షకు వచ్చిన రాజకీయ రూపమే తెలంగాణ రాష్ట్రం.

తెలంగాణ ఉద్యమ చరిత్రను తిరగేస్తే ఆంధ్ర పాలక వర్గాల ఆధిపత్యం, వివక్ష, వనరుల దోపిడీ, ఉద్యోగాల అన్యాయ పంపిణీ, నీటి హక్కుల నిరాకరణ వంటి అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి. 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కాసు బ్రహ్మానందరెడ్డి, హోంమంత్రిగా జలగం వెంగళరావు ఉన్న కాలంలో పోలీసుల కాల్పుల్లో వందలాది మంది యువకులు ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ ఉద్యమ చరిత్రకారులు, పలు అధ్యయనాలు 750 మందికి పైగా యువకులు అమరులయ్యారని పేర్కొంటాయి. ఆ రక్తపు మరకలు ఇంకా తెలంగాణ సమాజ జ్ఞాపకాల నుంచి చెరిగిపోలేదు.

తర్వాత మలిదశ ఉద్యమంలోనూ వేలాది మంది విద్యార్థులు, యువకులు ఆత్మత్యాగాలు చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు తెలంగాణ స్వీయగౌరవ నినాదం మార్మోగింది. సకల జనుల సమ్మె దేశ చరిత్రలోనే అతిపెద్ద ప్రజా సమ్మెలో ఒకటిగా నిలిచింది. లక్షలాది ఉద్యోగులు విధులను బహిష్కరించారు. ఆర్టీసీ కార్మికులు, సింగరేణి కార్మికులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, రచయితలు, కళాకారులు ఉద్యమంలో భాగమయ్యారు. అందుకే తెలంగాణ రాష్ట్రం కేవలం భౌగోళిక పునర్విభజన కాదు; అది ఒక చారిత్రక ప్రజా విజయం.

అటువంటి రాష్ట్రం ఏర్పడి పన్నెండు సంవత్సరాలు దాటినా తెలంగాణ అస్తిత్వాన్ని ప్రశ్నించే ప్రయత్నాలు మాత్రం ఆగడం లేదు. ఒకప్పుడు తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన రాజకీయ శక్తులు ఇప్పుడు కొత్త రూపాల్లో ప్రవేశించి మళ్లీ అదే ఆధిపత్య రాజకీయాలను పునరుద్ధరించాలనే ప్రయత్నం చేస్తున్నాయనే అనుమానాలు తెలంగాణ సమాజంలో వ్యక్తమవుతున్నాయి.

పవన్ కళ్యాణ్ వంటి నాయకులు తెలంగాణలో రాజకీయ స్థలం వెతుక్కోవడం వారి హక్కు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయాలు చేయవచ్చు. కానీ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు చేస్తూ, రాష్ట్ర ఏర్పాటుపై అవమానకర వ్యాఖ్యానాలు చేస్తూ, ఇక్కడి చారిత్రక గాయాలను మళ్లీ రేపే ప్రయత్నం చేయడం మాత్రం ప్రజలు అంగీకరించరు. తెలంగాణ ఏర్పాటుతో

కోనసీమకు దిష్టి తగిలిందని, తెలంగాణ ఏర్పడినందుకు బాధపడ్డానని గతంలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనసుల్లో ఇప్పటికీ ఉన్నాయి. ఆ వ్యాఖ్యలు యాదృచ్ఛికంగా వచ్చినవి కావు; అవి ఒక రాజకీయ దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయని చాలామంది భావిస్తున్నారు. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే, తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇక్కడ నివసిస్తున్న ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రజలపై ఎక్కడా వ్యవస్థీకృత దాడులు జరగలేదు. హైదరాబాద్ సహా తెలంగాణ నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో లక్షలాది మంది ఆంధ్ర ప్రాంత ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. సినిమా పరిశ్రమలోనూ, రియల్ ఎస్టేట్ రంగంలోనూ, వాణిజ్య రంగాల్లోనూ వారు పూర్తి స్వేచ్ఛతో ముందుకు సాగుతున్నారు. వాస్తవానికి హైదరాబాద్ నగరం ఇప్పటికీ దేశంలో అత్యంత సురక్షితమైన, పెట్టుబడులకు అనుకూలమైన నగరాలలో ఒకటిగా గుర్తింపు పొందుతోంది. అందువల్ల తెలంగాణలో ఆంధ్రులపై వివక్ష జరుగుతోందనే కథనాలు రాజకీయ ప్రయోజనాల కోసం సృష్టించిన అపోహలుగా మాత్రమే కనిపిస్తున్నాయి. తెలంగాణ సమాజం తన పోరాటాన్ని ఎప్పుడూ ప్రాంతీయ ప్రజలపై కాకుండా ఆధిపత్య రాజకీయాలపై మాత్రమే నడిపింది. ఇది గుర్తుంచుకోవాల్సిన విషయం. ఇటీవలి కాలంలో నీటి వనరుల విషయంలో కూడా తెలంగాణ ప్రజల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి. గోదావరి, కృష్ణా నదుల జలాల పంపిణీ, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, అంతర్రాష్ట్ర జల వివాదాలు వంటి అంశాలపై తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. గతంలోనూ తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరాలు వ్యక్తమైన సందర్భాలు ఉన్నాయి. అందువల్ల నీటి హక్కుల విషయంలో తెలంగాణ సమాజం అత్యంత అప్రమత్తంగా ఉండటం సహజం.

అలాగే స్థానిక బీసీల హక్కులు, ఉద్యోగ అవకాశాలు, విద్యా రిజర్వేషన్ల అంశాలపై కూడా తెలంగాణ సమాజం ఎంతో సున్నితంగా స్పందిస్తుంది. దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించిన సామాజిక న్యాయ అవకాశాలను దెబ్బతీసే ఏ ప్రతిపాదన వచ్చినా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. ఇది ప్రాంతీయ విద్వేషం కాదు; రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ.

తెలంగాణ ఉద్యమం ఒక విషయం స్పష్టంగా నేర్పింది. ఈ గడ్డపై ప్రజల ఆత్మగౌరవాన్ని ఎవరూ తక్కువ అంచనా వేయకూడదు. ఇక్కడి ప్రజలు సహనంతో ఉంటారు. అతిథులను గౌరవిస్తారు. భిన్న ప్రాంతాల వారిని ఆదరిస్తారు. కానీ తమ చరిత్రను అవమానిస్తే, అమరుల త్యాగాలను చిన్నబుచ్చితే, రాష్ట్ర అస్తిత్వాన్ని ప్రశ్నిస్తే మాత్రం మౌనంగా ఉండరు.

తెలంగాణను రాజకీయ ప్రయోగశాలగా చూడటం మానుకోవాలి. ఇక్కడి ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ లాభాలు పొందాలనే ప్రయత్నాలు విఫలమవుతాయి. ఉద్యమం ద్వారా పుట్టిన ఈ రాష్ట్రం వెనుక ఉన్న చరిత్ర ఎంతో గొప్పది, త్యాగాలు ఎంతో విలువైనవి. వాటిని గౌరవించడం ప్రతి రాజకీయ నాయకుడి బాధ్యత.

తెలంగాణ ప్రశాంతంగా ఉంది. అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. ఇక్కడి ప్రజలు గత విభేదాలను అధిగమించి భవిష్యత్తును నిర్మించాలనుకుంటున్నారు. అలాంటి సమయంలో పాత గాయాలను మళ్లీ రేపే వ్యాఖ్యలు, ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచే రాజకీయాలు, కుట్రలు, కుతంత్రాలు ఎవరికీ మేలు చేయవు. తెలంగాణ ప్రజల సందేశం ఒక్కటే --- మా ఆత్మగౌరవాన్ని గౌరవించండి, మా చరిత్రను అవమానించొద్దు, ప్రశాంతంగా ఉన్న ఈ గడ్డపై మళ్లీ చిచ్చు పెట్టొద్దు.

ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు

బోనగిరి శ్రీనివాస్‌కి జన్మదిన శుభాకాంక్షలు

యోగాస్త్రం శరీరానికి దివ్య ఔషధం

జనసైన్యం సిటి

ప్రతి వ్యక్తి యోగను జీవన శైలి లో భాగం చేసుకోవాలని యోగాస్త్రం .శరీరానికిదివ్య ఔషదం అనిఆత్మకు స్వచ్ఛత మనసుకు ప్రశాంతతను చేకూర్చే ఉత్తమ సాధనమని రచయిత కాలమిస్ట్ తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షులు నేదునూరి కనకయ్య అన్నారు.నేడు రాజేంద్రనగర్ డివిజన్ అత్తాపూర్ జి'హెచ్'ఎం'సి లక్ష్మీ .నగర్ పార్కు లో అత్తాపూర్ యోగ సెంటర్అద్వైర్యంలో 12వ అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈకార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన నేదునూరి కనకయ్య ప్రసంగిస్తూ భారతదేశంప్రపంచానికి అందించిన గొప్పగిఫ్ట్ యోగ అని యోగ చేయడం వల్లశరీరం మనసు ఏకీకరణశారీరకపటుత్వం కలుగుతుందని యోగ మార్గం ఆరోగ్య భాగ్యమని అన్నారు.
సమావేశానికి అధ్యక్షత వహించిన
లక్ష్మీ నగర్ పార్క్ అధ్యక్షులు
అత్తాపూర్ యోగ సెంటర్ గురువు పి మహేందర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ నిరంతర యోగ సాధన ద్వారా ఆరోగ్య సౌభాగ్యం మానసిక స్థిరత్వం కలుగుతుందని అన్నారు.

యు నరసింహారావు అత్తాపూర్ వాకింగ్ అసోసియేషన్ అడ్వైసర్ ప్రసంగిస్తూ యోగాస్థ్రం అత్యంత ప్రబావ వంతమైన వాక్సిన్ లాగా పనిచేస్తుందని అన్నారు.
బీజేపీ నాయకులు కొమురయ్య మల్లారెడ్డి శ్రీధర్ మాట్లాడుతూ యోగ ప్రాణాయామం ఆరోగ్యానికి రక్షణ కవచాలన్నారు.ప్రముఖ సంఘ సేవకులు సీనియర్ పాత్రికేయులు మధు మాట్లాడుతూ యోగ సాధన ద్వారా

భావోద్వేగాల నియంత్రణ ఆత్మ నిర్భరత ఏర్పడి వ్యక్తుల్లో ఉత్పాదక సామర్థ్యం ఇనుమడించి జీవన ప్రమాణాలు పెరుగుతాయి అన్నారు.యోగ శ్వాస క్రీయ మానవుని రోగ నిరోధక శక్తి పెంచుతుందని రాష్ట్ర వ్యవసాయవిశ్వవిద్యాలయంమాజీ వైస్ ఛాన్సలర్ ప్రోఫసర్ రాఘవ రెడ్డి అన్నారు.ఉచిత యోగ తరగతులను నిర్వహించిన యోగ సెంటర్ గురువు పి మహేందర్ ను అత్తాపూర్ యోగా సెంటర్ సభ్యులు మిత్రులు శ్రేయాభిలాషులు శాలువ గిఫ్ట్ పూల మాలతోసభ్యులు ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ యోగా సభ్యులను సన్మానించారు.యోగ దినోత్సవం సందర్భంగా సభ్యులు సామూహికంగా సూర్యనమస్కారాలు వృక్ష ఆసనం చక్రాసనం ప్రదర్శించారు.అత్తాపూర్ యోగ సెంటర్ సభ్యులు ఘనంగా యోగ దినోత్సవం నిర్వహించారు.

ఘనంగా ఒలింపిక్ డే రన్

జనసైన్యం సిటి
కరీంనగర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్ ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల నుండి జరిగిన ఈ రన్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కరీంనగర్ జిల్లా క్రీడలు యువజన శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని రగిలించి క్రీడారంగంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఒలింపిక్స్ స్ఫూర్తిని రగిలించేందుకు ఈ రన్ దోహదపడుతుందన్నారు. జిల్లాలోని క్రీడా సంఘాలను సమన్వయ పరిచి క్రీడారంగ అభివృద్ధిలో ఒలింపిక్ అసోసియేషన్ ది ముఖ్యభూమిక అన్నారు. విద్యార్థులు తమకు అభిరుచి ఉన్న క్రీడల్లో పాల్గొంటూ జిల్లా రాష్ట్రానికి పేరు తేవాలన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు నందెల్లి మహిపాల్ మాట్లాడుతూ సుదీర్ఘ చరిత్ర కలిగిన ఒలింపిక్ అసోసియేషన్ క్రీడా సంఘాలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ క్రీడారంగం అభివృద్ధికి పాటుపడుతున్నట్లు చెప్పారు. గతంతో పోలిస్తే జిల్లాలో ఉన్న క్రీడా మౌళిక సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు వాటి ఆవశ్యకతపై సంపూర్ణ అవగాహన కలిగించేందుకు ఉద్దేశించిన ఒలింపిక్ డే రన్ ను ప్రతియేటా జిల్లాలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంతో పోలిస్తే ప్రభుత్వాలు క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఎక్కువ నిధులు కేటాయించడం సంతోషదాయకం అన్నారు. అనంతరం అతిథులు క్రీడా జ్యోతిని వెలిగించి రన్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ బాధ్యులు తుమ్మల రమేష్ రెడ్డి, కన్న కృష్ణ ,నాగిరెడ్డి సిద్ధారెడ్డి,లక్ష్మణ్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాబు శ్రీనివాస్ గౌడ్, ఆడెపు శ్రీనివాస్, అంతర్జాతీయ పారా క్రీడాకారులు అంజనా రెడ్డి, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు వీర్ పాల్ రెడ్డి, ఇజాజ్ అహమ్మద్, కే సమ్మయ్య, సుమన్ కళ్యాణ్, రామానంద తీర్థ , బి. రాజగోపాల్, హరి కిషన్, ఈ. రవీందర్, సత్యనారాయణ , కోచస్ తదితరులు పాల్గొన్నారు ఇట్టి రన్ లో దాదాపుగా 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆత్మ విమర్శ చేసుకుంటూ గమ్యం దిశగా అడుగులు వేయండి

జనసైన్యం సిటి

ఆత్మ విమర్శ చేసుకుంటూ, బలహీనతలను త్యాగం చేసుకుంటూ, బలాలను పెంచుకుంటూ ముందడుగు వేస్తేనే నిక్కంగా విజయం సిద్ధిస్తుందని లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు జ్యోతిశ్మతి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న 10-రోజుల ఎన్‌సిసి సంయుక్త వార్షిక శిక్షణ శిబిరంలో మోటివేషన్ స్పీకర్‌గా 500 మంది కెడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఒక సక్రమమైన దిన చర్యను అవలంబిస్తూ నిత్యం కొంత మెరుగైన ఫలితాలను పాటిస్తూ ఎంతుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. చదువులతో పాటు జనరల్ నాలెడ్జ్ అంశాలను పెంపొందించుకోవాలని, డిగ్రీ పట్టాతో పాటు ఆకర్షణీయమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని కోరారు. మన సహచరులతో పోల్చుకొని అనవసర ఒత్తిడికి గురికాకుండా, మన మీద మనకు విశ్వాసాన్ని పెంపొందించుకుంటూ సాగాలని అన్నారు. మనం ఎంచుకున్న లక్ష్యాలు నిర్థిష్టంగా ఉండాలని, ఈ పోటీ ప్రపంచంలో అగ్ర స్థానంలో నిలవడానికి ఇష్టంగా కష్టపడాలని అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిని క్యాంపు కమాండెంట్ కల్నల్ జయంత, పరిపాలనాధికారి కల్నల్ కృష్ణలు జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ సిబ్బంది 500లకు పైగా కెడెట్లు పాల్గొన్నారు.

భారతదేశ గతినే మార్చిన మహనీయుడు మోదీ

జనసైన్యం సిటి
12 ఏళ్ల పాలనలో భారత దేశ గతినే మార్చేసిన మహనీయుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. 12 ఏళ్ల మోదీ పాలన ఒక్క అవినీతికి తావులేకుండా సుస్థిర పాలనతో భారత్ ను అగ్ర రాజ్యాల సరసన చేర్చి భారతదేశ గతినే మార్చేశారని అన్నారు. డిజిటల్ ఇండియా విషయంలో విప్లవం సృష్టించారన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలోనూ సునామీ సృష్టించారని చెప్పారు. సామాన్య ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహానీయుడు మోదీ అని కొనియాడారు. కిసాన్ సమ్మాన్ నిధి, ఎరువుల సబ్సిడీ, కిసాన్ క్రెడిట్, ఇన్సూరెన్స్, భూసార పరీక్షలతో రైతుల జీవితాలను మార్చే దిశగా అనేక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. దేశంలోకి వచ్చిన రోహింగ్యాలు, అక్రమ చొరబాటుదారులంతా 2014కు ముందు వలస వచ్చిన వాళ్లేనని చెప్పారు. మోదీ పాలనలో అక్రమ చొరబాట్లపై ఉక్కుపాదం మోపారన్నారు. సర్ పేరుతో ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. బంగ్లా, పాకిస్తాన్ నుండి బెంగాల్ కు అక్రమంగా వలస వచ్చిన ముస్లిం ఓట్లను తొలగిస్తే తప్పేంటని ప్రశ్నించారు. తెలంగాణలోనూ నిజమైన పౌరుడి ఓట్లను తొలగించే అవకాశమే లేదన్నారు. ముస్లింలుసహా ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అక్రమ చొరబాటుదారుల ఓట్లను, దొంగ ఓట్లను కచ్చితంగా తొలగించాల్సిందేనన్నారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కరీంనగర్ లోని ఈఎన్ గార్డెన్స్ లో నిర్వహించిన "మేధావుల సదస్సు"లో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, ఎల్ఐసీ సౌత్ జోన్ అధ్యక్షులు రాజయ్య, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఆకుల శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు...

ఒక ప్రభుత్వ పాలనను, దేశ ప్రధాని నాయకత్వ సామర్థ్యాన్ని చరిత్ర ఎలా అంచనా వేస్తుంది? ఆ పాలనకు ముందు 1. భారత్ ఎట్లుండే... ఇప్పుడెట్లా మారింది? 2. ప్రపంచమంతా భారత్‌ను ఎలా చూస్తోంది? 3. ఆ పాలనవల్ల సాధారణ పౌరుడి జీవితం ఏమైనా మారిందా? దేశ దిశ-దశను మార్చగలిగిందా? ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచగలిగిందా? అనేది ముఖ్యం.

చరిత్రలో ఎంతో మంది ప్రధానులు ప్రభుత్వాలను నడిపారు. టర్మ్ అయిపోగానే వెళ్లిపోయారు. కానీ దేశ దిశ దశను మార్చిన మహానాయకుడు ఎవరంటే కచ్చితంగా మోదీనే. భారత్ పేరు వింటే అభివృద్ధి చెందుతున్న దేశమనే ఇన్నాళ్లు చెప్పుకున్నాం. కానీ మోదీ పాలనలో "భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించింది. ఆర్థిక ప్రగతిలో 4వ స్థానానికి చేరుకుంది. నాడు ప్రపంచ దేశాలకు భారత్ అంటే చులకన. నేడు రెడ్ కార్పెట్ పరిచి మన ప్రధానికి విదేశాలకు సెల్యూట్ చేసే పరిస్థితి వచ్చింది.

2014కు ముందు యూపీఏ పాలనంతా 2జీ స్కాం, 3జీ స్కాం, బొగ్గుసహా రోజుకో అవినీతి కుంభకోణమే. పంచభూతాలను అవినీతిమయం చేశారు. బలహీనమైన ప్రధాని. బలహీనమైన నిర్ణయాలు , విధాన నిర్ణయాల్లో శూన్యత, ప్రపంచ వేదికపై అత్యంత పరిమిత ప్రభావం భారత్ ది.

ఎన్డీఏ 12 పాలనలో పరిస్థితి పూర్తిగా మారింది. అవినీతిరహిత పాలన కొనసాగుతోంది. బలమైన ప్రధానమంత్రి ఉన్నారు. విధాన నిర్ణయాల్లో తెగువ చూపుతున్నారు. ప్రపంచ రాజకీయాల్లో కీలక శక్తిగా భారత్ ఎదిగింది. దూరదృష్టి, ధైర్యం, మోదీ నాయకత్వమే కారణం.

ప్రధాని పదవి అంటే కొన్ని కుటుంబాలకే పరిమితం అనే స్థితినుండి సామాన్యుడు కూడా ప్రధాని కావొచ్చని నిరూపించిన నేత మోదీ.

సామాన్యుడి సాధించిన విజయాలను విశ్లేషిస్తే....

1. పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. 25 కోట్ల మందిని పేదరికం నుండి బయటకు తీసుకొచ్చారు. 81 కోట్ల మందికి ఉచిత ఆహార భద్రత... 15 కోట్ల ఇళ్లలో టాయిలెట్లు... 11 కోట్ల ఉజ్వల కనెక్షన్లు ఇచ్చాం. 4 కోట్ల ఇండ్ల నిర్మాణం పూర్తి. మరో 3 కోట్ల ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభం. ప్రతి ఇంటికి తాగునీరు... 58 కోట్ల జన్ ధన్ ఖాతాలు... ఇవన్నీ పేదవాడి జీవితానికి గౌరవం తెచ్చాయి.
2. . డిజిటల్ ఇండియా -- ప్రపంచానికి భారత మోడల్. నాడు బ్యాంకు ఖాతాయే లేని పేదవాడు ఇయాళ మొబైల్ ఫోన్‌తో నేరుగా ప్రభుత్వ నిధులు పొందుతున్నాడు. లావాదేవీలన్నీ ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంతో జరుపుతున్నారు.
3. అవినీతి నియంత్రణ...కాంగ్రెస్ పాలనలో "ఢిల్లీ నుంచి రూపాయి పంపితే పేదవాడికి 15 పైసలే చేరేది... ఇదీతో సంక్షేమ పథకాల డబ్బు నేరుగా లబ్ధిదారుడి ఖాతాలోనే జమ. నో బ్రోకర్స్.. నో కరప్షన్... జేఏఎంతో(జన్ ధన్-ఆధార్-మొబైల్) ద్వారా ఏకంగా 51 లక్షల కోట్ల రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జమ చేసి అవినీతి రహిత వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత మోదీగారిదే.
4. ప్రపంచ వేదికపై భారత గౌరవం....ప్రపంచ రాజకీయాల్లో "జీ హుజూర్" అనే స్థాయి నుండి అగ్ర రాజ్యాల "నిర్ణయాలను సైతం ప్రభావితం చేసే దేశం"గా భారత్ మారింది. +20 అధ్యక్షత, అంతర్జాతీయ సౌర కూటమి, గ్లోబల్ సౌత్‌కు నాయకత్వం వహించాం. విదేశాల్లో యుద్దాలు జరిగితే ఆపి భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చినం.
5. జాతీయ భద్రత.....భారత్ శాంతిని కోరుకుంటుంది. కానీ బలహీనత కాదు. అంతర్గత భద్రతకు భంగం కలిగించే అసాంఘిక శక్తులను కూకటి వేళ్లతో పెకలించి వేస్తున్నారు. ఆపరేషన్ సింధూర్, ఆపరేషన్ మహదేవ్, పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లి దాడులతో ఉగ్రవాదానికి వార్నింగ్ ఇచ్చి సత్తా చాటాం.
6. ఆత్మనిర్భర్ భారత్.... దిగుమతుల స్థాయి నుండి స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేకిన్ ఇండియా నినాదంతో విదేశాలకు వస్తువులను ఎగుమతి చేసే స్థాయికి వచ్చాం. ఆత్మనిర్భర భారత్ పేరుతో 20 లక్షల కోట్లు కేటాయించి 2 లక్షల స్టార్టప్ లు, కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నాం. 2014 లో కేవలం 2 మొబైల్ కంపెనీలు ఉంటే నేడు 300 కు పైగా మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటు. మౌలిక సదుపాయాల బడ్జెట్‌ను 2 లక్షల కోట్ల నుండి 12 లక్షల 20వేల కోట్లకు పెంచినం.
7. .మౌలిక సదుపాయాల విప్లవం సృష్టించాం. రోడ్లు, రైల్వేలు, విమాన రంగాల్లో పెను మార్పులు తెచ్చారు. 2014 నాటికి రోడ్ల బడ్జెట్ 31 వేల కోట్లుంటే నేడు ఏటా 3 లక్షల కోట్లు కేటాయిస్తున్నారు. 12 ఏళ్లలో 91 వేల కి.మీ.కు పైగా హైవేల నిర్మించారు. డొక్కు రైళ్లు, కంపు కొట్టే టాయిలెట్ల నుండి వందే భారత్ యుగం తీసుకొచ్చారు. అమ్రుత్ భారత్ పేరుతో రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. 2014లో మెట్రో రైళ్ల నెట్‌వర్క్ 248 కి.మీ మాత్రమే... 2026 నాటికి 1,155 కి.మీలకు విస్తరించారు. గతంలో దేశంలో 74 ఆపరేషనల్ ఎయిర్‌పోర్టులుంటే నేడు 165 ఎయిర్‌పోర్టుల ఏర్పాటు చేసినం. చిన్న పట్టణాలకు ఎయిర్ కనెక్టివిటీ సౌకర్యం కల్పిస్తున్నారు. విమానాశ్రయాల విస్తరణ కోసం 1 లక్షా 40 వేల కోట్లకు పైగా పెట్టుబడులు. చిన్న పట్టణాలకు కూడా విమాన సదుపాయాలు. యూపీఏ హయాంలో 2014న మౌలిక సదుపాయాలకు సుమారు 2 లక్షల కోట్లు ఖర్చు పెడితే...2026-27లోనే ఏకంగా 12.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా మౌలిక సదుపాయాలు నిర్మిస్తున్న దేశంగా భారత్ నిలిచింది.
8. రైతు సంక్షేమం....దాదాపు 10 కోట్ల మంది రైతుల ఖాతాల్లో 5 లక్షల కోట్లుపీఎం-కిసాన్ నిధి జమ. పంటల బీమా, ఎరువుల సబ్సిడీ పేరిట రైతు కుటుంబాలకు ప్రత్యక్ష సాయం అందుతోంది. ఎరువుల సబ్సిడీ పేరుతో 12 లక్షల కోట్లు ఖర్చు. వడ్లు, పత్తిసహా పంటలకు కనీస మద్దతు ధర రెట్టింపు.
9. మహిళా సాధికారత.... ఉజ్వల కనెక్షన్లు, ముద్రా రుణాలు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా రిజర్వేషన్ చట్టం... మహిళా అభివృద్ధి కేంద్రబిందువుగా చట్టాలు. ఇల్లు మంజూరు. మహిళా సాధికారత.

తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులు......12 ఏళ్లలో 13 లక్షల కోట్ల రూపాయల ఖర్చు చేసినం. పన్నుల వాటా 1 లక్షా 18 వేల కోట్లు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద 1 లక్ష కోట్లు ఇచ్చినం.కేంద్రమే వడ్డీ భరిస్తూ 50 ఏండ్ల వడ్డీ లేని రుణం కింద తెలంగాణకు దాదాపు 10 వేల కోట్ల సాయం. యూపీఏతో పోలిస్తే బడ్జెట్ ఏకంగా 20 రెట్ల పెంపు. 2014లో తెలంగాణకు రైల్వే బడ్జెట్ 258 కోట్లు. నేడు 5 వేల 5 వేల 336 కోట్లు కేటాయింపు. వంద శాతం రైల్వే లేన్ల విద్యుద్దీకరణ పూర్తి. 413 కోట్లతో చర్లపల్లి కొత్త టెర్మినల్ స్టేషన్‌ను నిర్మించినం. 40 రైల్వే స్టేషన్లు 'అమృత్ స్టేషన్లు'గా నిర్మాణం. 5 వందే భారత్ రైళ్లు ప్రయాణం. త్వరలో మరో 3 బుల్లెట్లు రైళ్లు ప్రయాణించబోతున్నాయి.

తెలంగాణలో హైవేస్ విషయానికొస్తే.. 12 ఏళ్లలో 5 వేల కిలోమీటర్లకుపైగా హైవేల నిర్మాణం. 31 వేల కోట్లు ఖర్చు. భారత్‌మాల కింద 38 వేల 297 కోట్లతో 1,719 కిలోమీటర్ల మేర హైవే కారిడార్లను మంజూరు చేసినం. ఓవరాల్ గా హైవేల కోసమే కేంద్రం లక్షా 15 వేల కోట్లు ఖర్చు చేసింది.

రైతాంగం, విద్య, వైద్య రంగాల విషయానికొస్తే.... నిజామాబాద్ లో పసుపు బోర్డు ఏర్పాటు చేశారు. 1350 కోట్లతో బీబీనగర్ లో ఎయిమ్స్ (గూ××మీా) ఏర్పాటు, ములుగులో ట్రైబల్ వర్శిటీ ఏర్పాటు. కాజీపేటలో 500 కోట్లతో రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు. టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేశారు. 7 జిల్లాల్లో కొత్త నవోదయ విద్యాలయాల మంజూరు. 1 కోటి 32 లక్షల మందికి జన్ ధన్ బ్యాంక్ ఖాతాలు తెరిపించినం. 'జల్ జీవన్ మిషన్' తో 53 లక్షల 90 వేల గ్రామీణ ఇండ్లకు సురక్షితమైన తాగునీటి సరఫరా చేసినం. పీఎం కిసాన్ కింద తెలంగాణలోని 30 లక్షల 40 వేల మంది రైతులకు ఏటా 6 వేల చొప్పున చెల్లింపు. 11 లక్షల 80 వేల మందికి ఉచిత ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినం. ఉపాధి కోసం ముద్రా స్కీమ్ కింద 86 వేల 8 వేల కోట్లకు పైగా రుణాలు ఇచ్చి ఆదుకున్నాం.

తెలంగాణే కాదు... అన్ని రాష్ట్రాల అభివృద్ధికి మోదీగారు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నారు. కేంద్ర బడ్జెట్ లో 10 శాతం నిధులు ఈశాన్య రాష్ట్రాలకే. వారసత్వ రాజకీయాలకు భిన్నం. ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి ప్రధాని అయితే దేశాన్ని ఎంత క్రమశిక్షణతో నడపవచ్చో మోదీ గారు నిరూపించారు. కారణ జన్ముడు మోదీగారికి భగవంతుడి ఆశీస్సులు పుష్కలంగా దక్కాలి.

వడ్ల కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై దుష్ప్రచారం చేస్తోంది. వాస్తవానికి ప్రతి గింజను కేంద్రమే కొంటోంది. రాష్ట్ర ప్రభుత్వం మధ్య దళారి మాత్రమే. కొనుగోలు చేసి కేంద్రానికి అప్పగించినందుకు కమీషన్ కూడా చెల్లిస్తున్నాం. అయినా వడ్లు కొనడం లేదని చెప్పడం బాధాకరం. వాస్తవానికి పంట చేతికొచ్చే సమాయానికి ముందే కేంద్రం ప్రతి రాష్ట్రం నుండి వడ్ల కొనుగోలుపై ప్రతిపాదనలు కోరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మేరకే వడ్లను కొనుగోలు చేస్తోందన్నారు. ప్రతిపాదనలు సరిగా పంపకుండా కేంద్రంపై నెపం నెట్టడం దుర్మార్గం.

ఈ నేపథ్యంలో మోదీ గారి 12 ఏళ్ల పాలనలో దేశానికి జరిగిన మేలును సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కోరుతున్నా. మోదీ పాలనకు బహిరంగంగా మద్దతిచ్చి ఆశీర్వదించండి. ఈ దేశ భవిష్యత్తు కోసం, సుస్థిర పాలన కోసమైనా మోదీగారికి సంపూర్ణ మద్దతు ప్రకటించాలని మేధావులను కోరుతున్నా...

ఆఖరు మజిలీ



గర్వపడకు మిత్రమా..
అప్పుడే వికసించిన..
పువ్వుకు తెలియదు
తాను గుడిలోకి చేరుతానో..
శవంపైన విసరబడతానో అని
మనిషి పరిస్థితి కూడా అంతే కదా !
కొమ్మపై పక్షులు వాలుతాయి..
కొమ్మ ఎన్నడూ బరువుని తలవలేదు
పక్షి బరువుకు ఏ కొమ్మా విరగలేదు
కొమ్మపై వాలిన పక్షి ఎన్నడూ..
జారి కింద పడి చనిపోలేదు
తల్లిదండ్రులకు పిల్లలు బరువు కాదూ
పిల్లలకు అమ్మానాన్నల భారం కారాదు !
నీకు విలువనివ్వని..
ఎవ్వరి వెంట ఎప్పుడూ పడకు
నీ గైర్హాజరైన తెలుపుతుంది..
నీ విలువ ఎంత అని..
విలువను ఎన్నడూ అడగకు..
అది ఎదుటి వారు ఇవ్వక..
తప్పని పరిస్థితిని సృష్టించు !
జీవితం ఓ రైలు ప్రయాణం
రైలు ఆగుతుంది, కదులుతుంది
వేగంగా వెళ్తుంది.. నిలబడుతుంది
వచ్చే వారు వస్తుంటారు..
పోయే వారు పోతుంటారు..
ఆఖరు మజిలీ వచ్చీ రాగానే..
నిర్దయగా నిన్ను ఒంటరిని చేసి..
అందరూ ఎవరి దారిన వారు..
గప్ చుప్‌గా వెళ్లి పోతారు !

మధుపాళీ

ఇన్స్పైర్ మనక్ జాతీయ మెంటరింగ్ శిబిరానికి పారమిత విద్యార్థులకు ఆహ్వానం

జనసైన్యం సిటి

స్థానిక కరీంనగర్, పద్మనగర్ లోని పారమిత హెరిటేజ్ స్కూల్ విద్యార్థులు ఎం. చెగువేరా మరియు కె. వికాస్ లకు , జూన్ 22 నుండి 24 వరకు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , వరంగల్లో నిర్వహించనున్న ఇన్స్పైర్ మనక్ జాతీయ మెంటరింగ్ శిబిరం లో పాల్గొనే అరుదైన అవకాశం లభించిందని పాఠశాల డైరెక్టర్ హన్మంత రావు తెలిపారు.

భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని జాతీయ ఆవిష్కరణల సంస్థ , తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి, ఎన్. ఐ. టి. వరంగల్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ ఆవిష్కరణల ఆధారంగా ఎంపికైన 30 మంది విద్యార్థుల్లో చెగువేరా, వికాస్‌లు చోటు సంపాదించడం విశేషం. వీరు గత సంవత్సరం నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో, వారి మార్గదర్శకుడు శ్రీ లలిత్ మోహన్ సాహు గారి పర్యవేక్షణలో రూపొందించిన ప్రాజెక్టు ద్వారా, కరీంనగర్ జిల్లా నుండి ఇన్స్పైర్ మనక్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. చెగువేరా "సౌరశక్తితో పనిచేసే ధాన్యపు వేర్పాటు యంత్రం" అభివృద్ధి చేయగా , వికాస్ "బహుళ ప్రయోజన స్టడీ డెస్క్" రూపొందించాడు. ఈ మెంటరింగ్ శిబిరంలో పాల్గొనే విద్యార్థులు దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు మరియు పరిశోధకులతో ప్రత్యక్షంగా సంభాషించే అవకాశం పొందనున్నారు. అలాగే ఈ ఏడాది చివర్లో జరగనున్న జాతీయ స్థాయి ప్రదర్శన మరియు ప్రాజెక్ట్ పోటీ కోసం తమ ప్రాజెక్టులను మరింత మెరుగుపరచుకునేందుకు నిపుణుల మార్గదర్శకత్వం అందుకోనున్నారు.ఈ సందర్భంగా జాతీయ మెంటరింగ్ శిబిరానికి ఎంపికైన విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు, డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, రాకేష్, , వి. యు. యం. ప్రసాద్, వినోద్, హనుమంతరావు, ప్రిన్సిపాల్ గోపికృష్ణ, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది అభినందిస్తూ వారి భవిష్యత్తులో మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

అధిక ఫీజుల నియంత్రణకు విద్యార్థి సంఘాలు ఉమ్మడిగా పోరాటం చేయాలి.

వడ్డేపల్లి మల్లేశం

అధిక ఫీజుల నియంత్రణకు విద్యార్థి సంఘాలు ఉమ్మడిగా పోరాటం చేయాలి. ఉపాధ్యాయ ప్రజా సంఘాలను కలుపుకొని విద్య ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తావా? భారీగా ఫీజులు తగ్గిస్తావా? ప్రభుత్వానికి అల్టిమేట్ ఇవ్వాల్సిందే.....

రాష్ట్రంలో విద్యారంగంలో ప్రైవేటు వ్యవస్థలో అధిక ఫీజుల నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, భారతదేశంలోనే అత్యధిక స్థాయిలో ఫీజులను వసూలు చేస్తూ రాష్ట్ర ప్రైవేట్విద్యా వ్యవస్థ రాష్ట్ర ప్రతిష్ట అపహాస్యం చేస్తున్నదని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి గారు స్వయంగా విద్యారంగ సమీక్షపై కొనసాగిన చర్చలో ముఖ్యమంత్రి గారితో చెప్పారంటే తెలంగాణలో ఉన్నటువంటి ప్రైవేటు దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో కొనసాగుతున్న ఫీజుల వ్యవస్థ, టిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో పేరెంట్స్ కమిటీ మేరకు ఏర్పడిన తిరుపతిరావు గారి కమిషన్ చేసిన సిఫారసులు, ఆనాటి లో పాయి కారి ఒప్పందాలు, నాటి ప్రభుత్వం విఫలం కావడంతో పది నుండి 30% ఏటా పెంచడం వల్ల ఇవాళ దేశంలోనే అత్యధిక ఫీజులు వసూలు చేసే రాష్ట్రంగా తెలంగాణ మిగిలిపోవడం సిగ్గుచేటు. ఈ దుర్భర పరిస్థితుల పైన విద్యాభిమానులుగా రాష్ట్రంలోని అన్ని విద్యార్థి సంఘాలు ఉపాధ్యాయ మేధావి ప్రజా సంఘాలను కలుపుకొని ప్రైవేటు విద్యావ్యవస్థలో కొనసాగుతున్న పరిణామాన్ని మొత్తం అధ్యయనం చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచాల్సిన అవసరం ఉన్నదని అనేకమంది నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులు ప్రాణాలు పోగొట్టుకుంటూ విద్యకు దూరమవుతూ అప్పుల పాలవుతున్న సంగతి మరిచిపోతే ఎలా? ఇది విద్యార్థి మేధావి ఉపాధ్యాయ ప్రజా సంఘాల యొక్క సామాజిక బాధ్యతని గుర్తించాలని నా విజ్ఞప్తి.

బుద్ధిజీవులుగా ఆలోచించాలి

ప్రస్తుతం కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాదు భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో ఇదే దుర్భరమైన పరిస్థితులు కొనసాగుతుంటే కొఠారి కమిషన్ 1966 లో చేసిన సూచన కామన్ స్కూల్ ప్రవేశపెట్టి ప్రభుత్వ రంగంలోనే విద్యను కొనసాగాలని సిఫారసును ఏనాడు అమలు చేయని భారతీయ ప్రభుత్వం ఇప్పటికీ ప్రజల ముందు తలవంచి తప్పును అంగీకరించాలి. కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా విద్య మొత్తాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి. అలా దమ్ము ధైర్యం లేకుంటే తమిళనాడు ప్రభుత్వం ఇటీవల ప్రకటించినటువంటి ఫీజుల వ్యవస్థను ఆధారం చేసుకుని నామమాత్రపు ఫీజుల మేరకు ప్రైవేట్ రంగంలో విద్యను అనుమతించాలి. కానీ ప్రైవేటు ఫీజుల దోపిడీ యదేచ్ఛగా కొనసాగుతుంటే ప్రభుత్వాలు చూస్తూ ఊరుకోవడం నిజంగా అవమానకరం. అది కేంద్రం నుండి రాష్ట్ర ప్రభుత్వాలు అందరూ కూడా సమానంగా బాధ్యత భరించాల్సిందే. సుమారు రెండు సంవత్సరాలు విద్యా కమిషన్ చైర్మన్ గా తన బృందంతో కొనసాగించినటువంటి పరిశీలన అంశాల పైన ఫిబ్రవరి 27, 2026 తేదీన ముఖ్యమంత్రి గారితో విద్యారంగం పైన జరిగిన చర్చలో కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి గారు తెలిపిన వివరాలు భయంకరంగా ఉన్నాయి. కమిషన్ చైర్మన్ గా లేనప్పుడు అసలు విద్య ప్రభుత్వ రంగంలోనే ఉండాలని ప్రైవేట్ రంగంలో ఉండకూడదని స్పష్టంగా ప్రకటించి ఉన్నారు కానీ కమిషన్ చైర్మన్ గా సిఫారసులను అందించినప్పుడు మాత్రం పూర్తిగా ప్రైవేటు వ్యవస్థను నిరాకరించకుండా ఫీజుల దోపిడిని మాత్రం ఎత్తి చూపడాన్ని మనం అర్థం చేసుకోవాల్సిన అవసరం చాలా ఉన్నది.

ఆకునూరి మురళి గారిచ్చిన కొన్ని వివరాలు

విద్యార్థి సంఘాలకు ముఖ్యంగా విజ్ఞప్తి ఏమిటంటే యువత ఆలోచన సరళి, అవినీతిని ప్రశ్నించే ధోరణి, మానవతా విలువలతో ఉన్నటువంటి మీకు ప్రైవేట్ రంగంలో కొనసాగుతున్న దోపిడీని అడ్డుకునే శక్తి ఉంది. కానీ కేవలం స్థానికంగా ఏ సంఘానికి ఆ సంఘమే పత్రికా ప్రకటనలతో చిన్న పోరాటాలతో ఈ ఉద్యమం సాధ్యం కాదు. రాష్ట్రస్థాయిలో అన్ని విద్యార్థి సంఘాలు ఏకమై డిమాండ్లను పొందుపరచుకొని ప్రభుత్వాన్ని మెడలు వంచవలసిన అవసరం ఎంతగానో ఉన్నది. అందుకోసం నాకు దృష్టికి వచ్చిన కొన్ని విషయాలను మీ ముందు ప్రస్తావిస్తున్నాను.

పదేళ్ల కిందట తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలల్లో సరాసరి వార్షిక ఫీజు 50,000 ఇప్పుడు అది 1,90,000 కు చేరింది అంటే రాష్ట్రంలో జరుగుతున్న దోపిడీని అర్థం చేసుకోవచ్చు అని చైర్మన్ వ్యాఖ్యానించారు. 2014 తర్వాత ఏర్పాటు చేసినటువంటి తిరుపతిరావు కమిషన్ ఎటు తేల్చుకోలేక ఏటా పది శాతం ఫీజులను పెంచుకోవచ్చని అనుమతించి ఉచిత సలహాతో ప్రైవేట్ సంస్థలకు మద్దతు పలికి ప్రజలకు ద్రోహం చేసింది. దాని పరిణామం కారణంగా ఇవాళ ప్రైవేట్ విద్యాసంస్థలు ఏటా 10 నుండి 30% ఫీజులను పెంచుకుంటూ పోతున్నాయి అని స్వయంగా ఆకునూరు మురళి గారు ముఖ్యమంత్రితో చర్చించడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. 2015- 16 సంవత్సరములో తెలంగాణలో సరాసరి పేజీ 50,000 ఉంటే ఉత్తరప్రదేశ్లో 35000 తమిళనాడులో 40000 ఆంధ్రప్రదేశ్లో 38,000 ఢిల్లీలో మాత్రం 60000 ఉండేదని ప్రస్తుతం ఈ 2025 26 సంవత్సరానికి ఉత్తర ప్రదేశ్ లో 95,000 తమిళనాడులో 1లక్ష, ఆంధ్రప్రదేశ్లో 1లక్ష ఢిల్లీలో 1.,60 ఉందని తెలంగాణలో మాత్రం 1,90,000గా ఉందని ఈ కమిషన్ వివరాలతో సహా తెలిపింది. ఇదే సందర్భంగా ప్రైవేటు విద్యాసంస్థల ఫీజు దోపిడీకి ప్రభుత్వం అడ్డుకట్ట వేయకపోతే పేద వర్గాలు నష్టపోయే ప్రమాదం ఉందని ఇంజనీరింగ్ కళాశాల తరహాలో ప్రత్యేకంగా ఫీజు నియంత్రణకు కమిటీ ఉండాలని ముఖ్యమంత్రికి సూచించినప్పటికీ సూచనలు అంగీకరించినారే తప్ప తల్లిదండ్రులపై భారం పడకుండా చర్యలు తీసుకోవాలని పత్రికా ప్రకటన ఇవ్వడంతోనే సరిపోదు. విద్యా కమిషన్ సూచన మేరకు చట్టబద్ధమైనటువంటి ఫీజు నియంత్రణ కమిషన్ ఏర్పరిచినారా? తెలుసుకోవలసినటువంటి అవసరం విద్యార్థి సంఘాలపై స్పష్టంగా ఉంది. ఇంకా అదే విద్యా కమిషన్ తన సిఫారసులలో రవాణా కోసం, బోర్డింగు, భోజనము, విహారయాత్రలు, క్యాప్టేషన్ ఫీజు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, స్టేషనరీ పేరుతో ప్రైవేట్ విద్యాసంస్థలు దోపిడీకి పాల్పడుతున్నాయని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోని ఎక్కువ ఉన్నాయని అసహనం వ్యక్తం చేయడం గమనించాల్సిన అవసరం ఉంది.

విద్యార్థి సంఘాలకు విజ్ఞప్తి

ఒక్కొక్క సంఘము స్థానికంగా జిల్లా మండల స్థాయిలో తీసుకుంటున్న పోరాట కార్యక్రమాలు సరిపోవడం లేదు. ముఖ్యంగా ప్రైవేటు ఫీజు నియంత్రణ అనేది రాష్ట్రస్థాయి సమస్య. ఏ ప్రభుత్వం ఉన్నా మొక్కుబడిగా కమిటీని వేయడం కాలయాపనతో దశాబ్దాలే గడిచిపోయింది. ప్రస్తుతం మనం మొత్తం విద్యావ్యవస్థ యావత్తు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని కామన్ స్కూల్ ప్రవేశపెట్టాలని బడ్జెట్లో విద్యకు 30% కేటాయించాలని డిమాండ్తో పోరాటం చేయాల్సినటువంటి అవసరం ఉంది. అయితే ఇది సాధ్యం కాదని చర్చల సందర్భంగా ముఖ్యమంత్రి లేదా ప్రభుత్వం తెలిపితే అప్పుడు మాత్రమే ఖచ్చితంగా ఫీజులను నియంత్రణ సగానికి సగం తగ్గించేలా ఒత్తిడి చేయాల్సినటువంటి అవసరం ఉంది. రెండే రెండు డిమాండ్లతో చేసే పోరాటం సత్ఫలితాలనుస్తుందని మీరందరూ మేధావులు బుద్ధి జీవులు ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని విస్తృత స్థాయిలో పోరాటం చేస్తే తప్పకుండా విజయం వరిస్తుందని ఒక రిటైర్డ్ ఉపాధ్యాయునిగా కవిగా రచయితగా నా ఆవేదన. రెండే రెండు డిమాండ్లతో ప్రభుత్వానికి అల్టిమేషన్ ఇవ్వడం ద్వారా1) అయితే ప్రభుత్వ రంగంలో విద్యను కొనసాగిస్తావా?2) లేకుంటే ప్రైవేట్ లో ఫీజులను సగానికి సగం భారీగా తగ్గించి సామాన్య పేద వర్గాలకు సహకరిస్తావా? అని తేల్చు కోవాల్సిన అవసరం ఉంది. ఇదే సందర్భంలో విద్యాహక్కు చట్టం ప్రకారంగా కార్పొరేట్ స్కూల్లో 25% సీట్లను పేద వర్గాలకు కేటాయించడం లేదు పేద వర్గాలకు ఉచితంగా కేటాయించే విధంగా కూడా ప్రభుత్వం పైన ఒత్తిడి తేవాల్సిన అటువంటి సామాజిక బాధ్యత బుద్ధి జీవులుగా మనందరి పైన ఉంది. ప్రైవేటు ఫీజుల నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థ కోసం ఆనాడు ముఖ్యమంత్రి ఆదేశించినట్లుగా తెలిసినప్పటికీ ఇప్పటివరకు ప్రత్యేక వ్యవస్థ అంటూ బహుశా లేదు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం ద్వారా వాస్తవాలను తెలుసుకొని మన డిమాండ్లను ముందు పెట్టడం ద్వారా పెట్టుబడిదారీ విద్య పక్కన పెట్టి ప్రభుత్వ రంగంలో నాణ్యమైనటువంటి విద్య కామన్ స్కూల్ ద్వారా అన్ని వర్గాలకు ఒకే విద్యను అందించడానికి కృషి చేయగలిగితే నూతన వ్యవస్థకు శ్రీకారం చుట్టినట్లే. స మ సమాజ స్థాపనకు తెలంగాణ రాష్ట్రంలో బీజం పడినట్లే అవుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు కాలంలో 17% నిధులను బడ్జెట్కు కేటాయిస్తే ప్రస్తుతము ఎనిమిది తొమ్మిది శాతం దగ్గర ఉన్నామంటే మనం ఏ వైపు అర్థం చేసుకోవచ్చు. ఇదే సందర్భంలో కొఠారి కమిషన్ సూచన మేరకు కేంద్రం 10% రాష్ట్రం 30% విద్యా రంగానికి బడ్జెట్లో కేటాయించాలని ప్రధాన డిమాండ్ గా పెట్టుకొని పోరాటాన్ని ఉధృతం చేయాల్సినటువంటి అవసరం ఉందని మీకు విజ్ఞప్తి చేస్తూ ప్రజలు ఇతర ఉచితలకు అలవాటు పడినందున విద్య వైద్యాన్ని డిమాండ్ చేయలేకపోతున్నారు. దానివల్ల మనం చేపడుతున్నటువంటి పోరాటాలకు మద్దతు లభించడం లేదు అందుకే విద్యార్థులుగా మేధావులుగా ఎక్కడికక్కడ మనం ప్రజల్లో భాగమై విద్యా వైద్యానికి మాత్రమే డిమాండ్ చేయగలిగితే ఇతర ఉచితాలను నిరాకరించగలిగితే ప్రజల యొక్క కొనుగోలు శక్తి భారీగా పెరిగే అవకాశం ఉంటుంది. తద్వారా ఆరోగ్యం విద్య ద్వారా చైతన్యం ఉపాధి అవకాశాలు మెరుగు పడటానికి పరోక్షంగా పేదరికం నిర్మూలించడం ద్వారా ఆత్మహత్యలను అదుపు చేయడానికి అవకాశం ఉంటుంది లేకుంటే అసమానతలు అంతరాలతో కూడుకున్న ఆర్థిక వ్యవస్థలో విద్యారంగంలో వేలాది లక్షలాది కుటుంబాలు ప్రైవేటు ఫీజు దోపిడీకి గురవుతుంటే చూస్తే అంతకుమించిన నేరం మరొకటి ఉండదు. విద్యా కమిషన్ మద్దతు కూడా మనకు లభిస్తుంది అనే విషయం విద్యార్థి సంఘాలు గుర్తిస్తే కొంతవరకైనా ప్రయోజనం ఉంటుంది అయితే కలిసి పోతేనే కలదు సుఖము ఉమ్మడి పోరాటంతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టవచ్చు అది సాధ్యం అందుకు మన ఐక్యత నిదర్శనం కావాలి.

(తమిళనాడు ప్రభుత్వం ప్రకటించిన ఫీజుల వివరాలను ఒక్కసారి పరిశీలిద్దాం ఎల్కేజీ యూకేజీ కి 16640 ఒకటి నుండి ఐదవ తరగతి వరకు 18635 ఆరు ఏడు తరగతి లకు 20635 9 10 తరగతి లకు 22,965 ఇంటర్మీడియట్ ఫస్ట్ సెకండ్ ఇయర్ కు 25825 వివరాలు అధికారికంగా తమిళనాడు ప్రభుత్వం ప్రకటించినట్లు అనేక ప్రకటనల్లో చూడడం జరిగింది అన్ని రాష్ట్రాలు కూడా దమ్ముంటే ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ రేట్లు అమలు చేసి తన సత్తాను చాటుకోవాలి)

వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 304 ఆధ్వర్యంలో యోగా దినోత్సవం వేడుకలు

జనసైన్యం సిటి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం కరీంనగర్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ,శ్రీరామ యోగ గ్రూప్ ,యోగా గురువు కుమార్ మహర్షి యోగ ఆసనాలను చేపీయడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 3 0 4 గవర్నర్ అన్నమనేని సుధాకర్ రావు పాల్గొన్నారు , డిస్టిక్ గవర్నర్ ఎలక్ట్ గుడిపాటి రమణారెడ్డి డిస్టిక్ క్యాబినెట్ సెక్రటరీ గొట్టుముక్కల రవీందర్ పాల్గొని యోగా ద్వారానే మానసిక ప్రశాంతత లభించి ఆరోగ్యమైన జీవితాన్ని పొందడం జరుగుతుందని అన్ని ఆరోగ్య సమస్యలకు యోగ ఒకటే మార్గమని తెలపడం జరిగిందిఅందుకే ప్రతి ఒక్కరూ వాకింగ్ యోగా ప్రతిరోజు తప్పకుండా చేయాలని కోరారు ,ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ వెల్ది సర్పంచ్ పెంచాల కిషన్ రావు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వేల్పుల వెంకటేష్ ఆర్ట్స్ చింతకింద శ్రీనివాస్ ఆడెపు కమలాకర్ తోట శ్రీనివాస్ మిరియాల శ్రీధర్ రెడ్డి పూసాల సంపత్ ఎడవల్లి శ్రీనివాస్ రెడ్డి తొడుపునూరు శ్రీనివాస్ మునీందర్ చెన్నాడి రవీందర్ రెడ్డి నాగెల్లి ప్రతాపరెడ్డి రాచకొండ అనిల్ వేముల విష్ణుమూర్తి రేకింధర్ సంపత్ భాస్కర్ రెడ్డి సాయన్న గీకురు ఆంజనేయులు రమేష్ రాజు గౌడ్ బండి రాదా శ్రీనివాస్ నాగన్న శ్యామ్ పొన్నం రాజు పెద్ది శీను సుదర్శన్ పాల్గొన్నారు అనంతరం యోగ గురువు కుమార్ మహర్షి గారిని డిస్టిక్ గవర్నర్ గవర్నర్ అన్నమనేని సుధాకర్ రావు గారు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియం లోని రచ్చబండ వాకర్ అసోసియేషన్ చెట్టుకింద బ్యాచ్ వాకర్స్ వాలీబాల్ టీం మరియు పెద్ద సంఖ్యలో వాకర్ సంఘ సభ్యులు పాల్గొన్నారు,

ఫాదర్స్ డే సందర్భంగా ఉచిత థైరాయిడ్ స్క్రీనింగ్ క్యాంపులు విజయవంతం

జనసైన్యం సిటి

ఫాదర్స్ డే సందర్భంగా వాసుదేవ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ఎలగందల శ్రీనివాస్ మరియు అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 137-A ఆధ్వర్యంలో ఉచిత థైరాయిడ్ హార్మోన్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించబడ్డాయి. కరీంనగర్‌లోని వాసుదేవ హాస్పిటల్‌లో ఉచిత థైరాయిడ్ పరీక్షలు నిర్వహించగా, ఇల్లంతకుంటలో కీర్తిశేషులు శ్రీ అల్లాడి ఆంజనేయ శర్మ గారి జ్ఞాపకార్థం వారి స్వగృహంలో ప్రత్యేక ఉచిత థైరాయిడ్ స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించబడింది. అదేవిధంగా రహీంఖాన్పేటలో నూతన అలయన్స్ క్లబ్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం నిర్వహించి, దానిలో భాగంగా ఉచిత థైరాయిడ్ పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎలగందల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచిత స్క్రీనింగ్ క్యాంపులను నిర్వహిస్తామని తెలిపారు. ఈ క్యాంపులో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మూడు నెలల పాటు ఉచిత వైద్య సంప్రదింపులు అందించబడతాయని, అవసరమైన ఇతర పరీక్షలను ప్రత్యేక రాయితీ ధరలతో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసుదేవ హాస్పిటల్‌లో 50 మంది, ఇల్లంతకుంటలో 70 మంది, రహీంఖాన్పేటలో 35 మంది రక్త నమూనాలు ఇచ్చి థైరాయిడ్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎలగందల శ్రీనివాస్, డాక్టర్ సునీల్ రాజ్, డాక్టర్ అశోక్, డాక్టర్ సాయి మేఘన, డాక్టర్ తేజ, డాక్టర్ సాయి ప్రీతమ్, వాసుదేవ హాస్పిటల్ సిబ్బంది, అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొంజర్ల మహేష్, కోల అన్నారెడ్డి, పుల్లల శ్యామ్, వీడీజీ-1 ప్రసాద్, సాగర్, పండుగ నాగరాజు, కుమారస్వామి, నాగేశ్వర్, వెంకటేశ్వర్లు, జోనల్ చైర్మన్ అల్లాడి ఆనంద్ కుమార్, ఆర్‌సీ మాటేటి శ్రీనివాస్, అలయన్స్ క్లబ్ ఆఫ్ రహీంఖాన్పేట సభ్యులు, గడ్డమీది శ్రీనివాస్, రాజేందర్, అశోక్, పర్శరాములు, అంతగిరి వినయ్ మరియు ఇతర అలయన్స్ క్లబ్ సభ్యులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండిన మిడ్ మానేరులో. కబడ్డీ ఆడి నిరసన తెలిపిన మాజీ ఎమ్మెల్యే

జనసైన్యం సిటి

మిడ్ మానేరు జలాశయాన్ని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సందర్శించి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులతో కలిసి జలాశయాన్ని పరిశీలించిన ఆయన, ప్రాజెక్టు ఆవరణలో కబడ్డీ ఆడారు. 'చెట్టు మీది కొంగ.. రేవంత్ రెడ్డి దొంగ' అంటూ కూతకు వెళ్లి నిరసన తెలిపారు. మిడ్ మానేరు జలాశయం ఎడారిలా మారి, ఎండిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు.

నేటి జీవన శైలి వ్యాధులకు యోగా పరిష్కారం

జనసైన్యం సిటి

భారతదేశం "యోగ భూమి"గా ప్రపంచ దేశాలన్ని గుర్తింపు ఇచ్చాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నేడు ప్రపంచమంతా ఒత్తిడి, ఆందోళనతోపాటు జీవన శైలి వ్యాధులతో బాధపడుతున్నారని, వీటికి సరైన పరిష్కారం నిత్యం యోగా చేయడమేనని చెప్పారు. ప్రతిరోజు దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ లో నిర్వహించిన యోగా వేడుకల్లో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, పలువురు బీజేపీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే...

అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. యోగా అనేది కేవలం వ్యాయామం కాదు, అది మనిషి శరీరం, మనస్సు, ఆత్మలను ఏకం చేసే జీవన విధానం. మన శరీరం, మనస్సు, ఆలోచనలు, ఆత్మ మధ్య సమన్వయం సాధించడమే యోగా ప్రధాన లక్ష్యం. ప్రపంచంలో ప్రతి దేశానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. కొన్నిదేశాలు టెక్నాలజీకి ప్రసిద్ధి చెందాయి. మరికొన్ని ఆర్థిక శక్తిగా ఎదిగాయి. కానీ భారతదేశానికి ప్రపంచం ఇచ్చిన అత్యున్నత గుర్తింపు ఏమిటంటే భారత్ ఒక "యోగభూమి". యోగా పుట్టింది భారతదేశంలో. ప్రపంచానికి యోగాను అందించింది భారతీయ సంస్కృతి. వేల సంవత్సరాల క్రితం మన ఋషులు ప్రకృతితో మమేకమై జీవిస్తూ ఆరోగ్య రహస్యాలను కనుగొన్నారు. వారు మనకు అందించిన అమూల్యమైన కానుకే యోగా. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యలైన ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, జీవన శైలి వ్యాధులకు మందుల కంటే ముందు యోగా ఒక సహజ పరిష్కారంగా నిలుస్తోంది. యోగా కోసం ఖరీదైన పరికరాలు అవసరం లేదు. ఎటువంటి పెట్టుబడి అవసరం లేదు. కావాల్సింది కేవలం సంకల్పం మాత్రమే. ప్రతిరోజూ కొద్దిసేపు యోగా చేస్తే శరీరం బలంగా ఉంటుంది. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఆలోచనలు స్పష్టంగా ఉంటాయి. పనితీరు మెరుగుపడుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీవితంలో సానుకూలత పెరుగుతుంది. ఇంత మంచి ఫలితాలు ఉన్నాయి కాబట్టే ఇవాళ ప్రపంచవ్యాప్తంగా డాక్టర్లు కూడా యోగాను ప్రోత్సహిస్తున్నారు. కరోనా మహమ్మారి సమయంలో యోగా, ప్రాణాయామం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం ఎంత ముఖ్యమో ప్రపంచమంతా గుర్తించింది. ఈ రోజు మనం యోగాను ఒక రోజు కార్యక్రమంగా కాకుండా, జీవితంలో భాగంగా మార్చుకోవాలి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు యోగాకు కేటాయిస్తే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలం. "యోగ చేస్తే రోగం దూరం" అనే నినాదాన్ని మన జీవితంలో ఆచరణలో పెట్టుకుందాం.

ప్రియతమ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో యోగా ప్రపంచవ్యాప్త ఉద్యమంగా మారింది. 2014లో ఐక్యరాజ్యసమితి వేదికపై భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ యోగా దినోత్సవాన్ని ప్రకటించాలని ప్రతిపాదిస్తే కేవలం 90 రోజుల్లోనే 177 దేశాలు ఈ ప్రతిపాదనకు మద్దతు ఇవ్వడం ప్రపంచ చరిత్రలో ఒక విశేషం. ఫలితంగా ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. నేడు 190కు పైగా దేశాల్లో వందల కోట్ల మంది యోగా చేస్తున్నారు. అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు, జపాన్ నుంచి బ్రెజిల్ వరకు యోగా ఆరోగ్యానికి మార్గదర్శిగా మారింది. "ఒక భూమి -- ఒక ఆరోగ్యం కోసం యోగా" వంటి సందేశాల ద్వారా మోదీగారు యోగాను ప్రపంచ శ్రేయస్సుతో అనుసంధానం చేశారు. ఇది భారతదేశానికి గర్వకారణం. ఆరోగ్యానికి యోగా ఒక అద్భుతమైన మార్గం. అందరం ప్రతిరోజూ యోగా చేద్దాం. ఆరోగ్యంగా జీవిద్దాం... భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటుదాం. ఇకపై ప్రతి కుటుంబ దిన చర్యల్లో యోగా ఒక భాగం కావాలని కోరుకుంటున్నా.

ఈరోజు నీట్ రీ ఎగ్జామ్. పరీక్ష రాయబోయే విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్. పరీక్షకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు జరిగాయి. పరీక్ష రాయబోయే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పొద్దున్నే యోగా కార్యక్రమాలను పూర్తి చేసుకున్నాం.

యోగాను సైన్సు ఎందుకు అంగీకరించదు?

పోరెడ్డి దామోదర్ రెడ్డి

కొన్నేళ్ళ క్రితం వరకూ శారీరక శ్రమకు చాలా విలువ ఉండేది. పొలాలకు వెళ్ళడం, మోట కొట్టడం, నాగలి దున్నడం, పశువులు మేపడం వంటి ఏ పని తీసుకున్నా అది శారీరక శ్రమతో కూడుకున్నదే! గృహిణులు ఇంటి పనులే కాకుండా వ్యవసాయపు పనులు కూడా చేసేవారు. వడ్లు దంచడం, పిండి విసరడం వంటివన్నీ శారీరక శ్రమలే! అవన్నీ జీవన శైలిలో అంతర్భాగంగా ఉండేవి. ప్రత్యేకంగా వ్యాయామం చేయడం ఉండేది కాదు. పరిశ్రమలు పెరిగి, యంత్రాలు వచ్చి శారీరక శ్రమం స్థానంలో బుద్ధిబలానికి విలువ పెరుగుతున్నకొద్దీ వ్యాయామం అవసరమైంది. ఆటలు అవసరమయ్యాయి. అందుకే అన్ని రకాల వ్యాయామాల్ని, జిమ్నాస్టిక్స్ ని, ఆటల్ని, క్రీడల్ని సైన్సు ఆమోదించింది. ముక్కు మూసుకుని చేసే ధ్యానాన్ని, యోగాను, సమాధిని సైన్సు అంగీకరించలేదు.

ఆటలతో, క్రీడలతో శారీరక శ్రమ లభిస్తుంది. శారీరక శ్రమతో జీవన క్రియలన్నీ ప్రారంభమవుతాయి. ప్రారంభమైనవి వేగాన్నందుకుంటాయి. దాంతో శరీర గ్రంథులూ, మెదడూ అవసరమైన రసాయనాల్ని విడుదల చేస్తాయి. ఫలితంగా శరీరంలో కణస్థాయి నుంచి అన్ని వ్యవస్థలలో చురుకుదనం పెరిగి మనిషి ఆరోగ్యవంతుడవుతాడు. ఆనందాన్ని అనుభవిస్తాడు. వేగంగా నడవడాన్ని, ఈత కొట్టడాన్ని, సైకిల్ తొక్కడాన్ని, కర్రసామును, జిమ్ లోని అనేక వ్యయామాల్ని జీవశాస్త్రం -- వైద్య శాస్త్రం ఒప్పుకుంది. ప్రోత్సహించింది కూడా. మరీ చిన్నపిల్లలయితే ఆటపాటలతో పాటు అనందంగా విద్యనేర్చుకునే వసతి ఉండాలని విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ తన శాంతినికేతన్ లో ఆ ఏర్పాట్లు చేశారు. ఆటలకూ, క్రీడలకూ దేవుడితోనూ, మతాలతోనూ సంబంధం లేదు. కానీ, హిందూ మతానికి సంబంధించి కొందరు యోగాను, ధ్యానాన్ని, సమాధిని పరమాత్మలో లీనమయ్యేందుకు మార్గంగా ఎంచుకున్నారు. ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక చింతనకు లంకె పెట్టారు. అందువల్ల వీటిని సైన్సు గుర్తించదు. మతధర్మాల్లాగా ఇవీ విశ్వాసాలుగా ఉండిపోతాయి. ముందుగా ఆ తేడాను గమనిస్తే వాటి వాటి స్థానాలేమిటో బోధపడుతుంది.

యోగాను ప్రతిపాదించిన పతంజలి “యోగః చిత్తవృత్తి నిరోధకః” అని అన్నాడు. అంటే యోగ ఆలోచనల్ని స్థంభింపజేస్తుందని అర్థం! అంతే కాదు. యోగ మోక్షానికి మార్గమనే చెప్పాడు పతంజలి -- అంతేకాని, ఆరోగ్యసాధనకోసం ఇది పనికొస్తుందని చెప్పలేదు. ఇటీవలి కాలంలో ఆధునిక యోగా గురువులు వారి వారి ఆలోచనల్ని జోడించి, జనాన్ని మభ్యపెడుతూ వ్యాపారం చేసుకుంటున్నారు. ఈ ఆధునిక వ్యాపార గురువులు యోగ కాన్సర్ నీ, ఎయిడ్స్ నీ కూడా తగ్గిస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. పతంజలి -- యోగాను ప్రతిపాదించిన కాలానికి కాన్సర్, ఎయిడ్స్ వంటి వ్యాధులు గుర్తించబడలేదు. యోగ ఈ వ్యాధుల్ని తగ్గిస్తుందంటే మరి నిరూపణ ఏదీ? వారి దగ్గర నిరూపణ ఏదీ లేదని కూడా మనకు తెలుసు. అయినా కూడా వారు పెట్టే 'చెవిలో పువ్వుని' భక్తితో పెట్టించుకుని, వారి పిట్టకథలు వింటూ ఉండాలని వారి కోరిక! యోగాతో సర్వరోగాలూ మటుమాయం అయ్యే మాటైతే...నిత్యం యోగాను పాటించిన రామకృష్ణ పరమహంస, రమణ మహర్షులను కాన్సర్ ఎందుకు కబళించిందీ? నేటి కాలంలో యోగా గురువుగా ప్రసిద్ధుడైన రాందేవ్ బాబా మోకాళ్ళ ఆపరేషన్ కోసం విదేశాలకు ఎందుకు వెళ్ళినట్టూ? మనకు మనం ఆలోచించుకోవలసిన విషయాలు.

'యోగ' - అంటే వ్యాయామం అనే అర్థం కూడా ఉంది కదా? మరి దాన్ని తీసుకుంటే తప్పేమిటి? అనేవారు కొందరుంటారు. దేహదారుఢ్యానికి ఉపయోగపడే పరేడ్ సైనికులకు, ఎన్.సి.సి. కాడెట్ లకు ఉంటుంది. స్కూలు పిల్లలకు డ్రిల్ పీరియడ్ ఉంటుంది. యోగ ఇలాంటి శారీరక వ్యాయామాల కిందికి రాదు. వైద్య రంగంలో 'ఫిజియోథెరపీ' ట్రీట్ మెంట్ ఉంది. ఏ రోగికి ఎలాంటి వ్యాయామం అవసరమో, అది ఎంత కాలం చేయాల్సి ఉంటుందో వైద్య నిపుణులు నిర్ణయిస్తారు. జిమ్స్ లో కూడా ట్రైనర్లు ఉంటారు. మీ ధ్యేయమేమిటో తెలుసుకుని, మీకు ఎలాంటి వ్యాయామం అవసరమో వారు అలాంటివి నిర్ధారిస్తారు. చెప్పుకోవాల్సింది ఏమంటే వ్యాయామానికి ఒక ధ్యేయం ఉంటుంది. ఏం కావాలనుకుంటున్నాం-ఏం సాధించాలనుకుంటున్నాం అనేదానిమీద ఎక్సర్ సైజ్ ప్రోగ్రాంలుంటాయి.

వైవిధ్యభరితంగా ఇన్ని ఆటలు, క్రీడలు, వ్యాయామాలు ఉండగా యోగా ఎందుకు? దాని వల్ల ఒనగూరే ప్రయోజనమేముందీ? అనేది సీరియస్ గా ఆలోచిస్తే విషయం అర్థమవుతుంది. చదువుల్లో కూడా అంతే కదా? మనం ఏం కావాలనుకుంటున్నామో, దాన్ని బట్టే కోర్సులుంటాయి.

డాక్టర్ అశోక్ రాజ్ గోపాల్ మోకాలి చిప్ప మార్పిడి చేసే ప్రత్యేక నిపుణుడు -- నీ రిప్లేస్ మెంట్ సర్జన్. ఆయన చెప్పిన విషయాల్ని 'ద డెయిలీ టెలిగ్రాఫ్' ప్రకటించింది. న్యూఢిల్లీకి చెందిన డీన్ నెల్సన్ కూడా కొన్ని వివరాలు అందించాడు. ఈ భారతీయ వైద్య నిపుణులు ఇచ్చిన వివరాలను, వివరణలను బట్టి మనం తెలుసుకోగలిగేది ఏమంటే -- చాలా మంది యోగా గురువులు మోకాలి చిప్ప మార్పిడికోసం సర్జరీ చేయించుకున్నవారే! ఇంకా చాలామంది ఇప్పటికీ సర్జరీ లైన్లో నిలబడుతున్నవారే. 'థండర్ బోల్ట్' అనే వజ్రాసనం వేసేవారికి ఈ మోకాలి చిప్ప ఆపరేషన్ లు తప్పని సరి అవుతున్నాయి. ఇంతకూ వజ్రాసనం ఎలా వేస్తారు? అంటే మోకాళ్ళు రెండూ వెనక్కి మడిచి, మడిమెల మీద కూర్చుంటారు. దాని వల్ల మోకాళ్ళు ఒత్తిడికి గురై నాడులూ, జాయింట్స్ దెబ్బతింటాయి. ఫలితంగానే యోగా గురువులు, వారి శిష్యులూ కలసికట్టుగా సర్జరీలు చేయించుకోవాల్సి వస్తోంది. ఈ విషయం మీద ఇంటర్ నెట్ లో చాలా సమాచారం ఉంది. కావల్సిన వాళ్ళు వెతుక్కోవచ్చు. మరో ముఖ్యవిషయమేమంటే ఈ యోగా గురువులు ఎవరికీ మానవ శరీర నిర్మాణానికి సంబంధించిన అవగాహన ఏమాత్రం ఉండదు. ఇష్టం వచ్చినట్టుగా కాళ్ళూ, చేతులూ, మెడ, భుజాలు వంచి విచిత్రమైన భంగిమలలో జనాన్ని ఆకర్షిస్తుంటారు.

యోగా వల్ల కీళ్ళ నొప్పులు వస్తాయని, ముందే నొప్పులు ఉన్నవారికి అవి అధికమౌతాయనీ ఆర్థోపెడిక్ డాక్టర్లు వివరణ ఇస్తున్నారు. వెన్నెముకను విల్లులా వెనకకు వంచడం వల్ల అనేక అనర్థాలున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. మనిషి వెన్నెముక ముందుకు వంగడానికి అనువుగా నిర్మాణమై ఉంది. మరి అందుకు విరుద్ధంగా వెనకకు వంచడమంటే రిస్కు తీసుకోవడమే కదా? నడుముకు పై భాగాన ఉన్న అవయవాలన్నీ వెన్నెముక ఆధారంగా నిలబడి ఉన్నాయి. అసలు మనిషి నిటారుగా నిలబడాలంటేనే -- వెన్నెముక బలంగా ఉండాలి. శరీరాన్ని నిలబెట్టాలి. మనిషి బరువంతా కాళ్ళమీద, నడుము మీద, వెన్నెముక మీద ఉంటుంది. ఆవు, గేదె, పులి, పిల్లి వంటి జంతువుల్లాగా కాదు. ఆ జంతువు వెన్నెముక భూమికి సమాంతరంగా ఉంటుంది. బరువంతా నాలుగు కాళ్ళమీద ఉంటుంది. మనిషికి ఆ వసతి లేదు. మనిషి వెననెముక భూమికి నిటారుగా ఉంటుంది. మనిషనే జెండాను ఎగరేస్తున్నట్టు మనిషి వెన్నెముక జెండా కర్రలాగా, భూమికి తొంభయి డిగ్రీల కోణంలో నిలబడి ఉంటుంది. అంటే భూమ్యాకర్షణ శక్తిని ఎదుర్కొంటూ వెన్నెముక మనిషిని నిలబెడుతుంది. అలాంటి ముఖ్యమైన భాగాన్ని ఇష్టం వచ్చినట్టు వంచడం అనేది తెలివైన పని కాదు. బాల్యం నుండే ఆసనాలు అభ్యాసం చేసేవారి విషయం వేరు. మధ్యవయస్సులో, వృద్ధాప్యంలో ప్రారంభించేవారు సమస్యలు ఎదుర్కోక తప్పదు. ప్రతివాడూ మల్లయోధుడో, సర్కస్ కళాకారుడో కానవసరం లేదు. ప్రతి జీవికి కొన్ని సౌలభ్యాలుంటాయి. కొన్ని అవరోధాలుంటాయి. వాటిని గమనించుకుంటూ జీవించడం మంచిది. ప్రాణాయామంలో గట్టిగా శ్వాసపీల్చి, వదిలేయాల్సిన గాలిని, అంటే కార్బన్ డై ఆక్సైడ్ ను వదిలివేయకుండా ఎక్కువ సేపు ఊపిరి తిత్తుల్లో బలవంతంగా ఆపడం జరుగుతుంది. అది మంచిది కాదని నిపుణులు చెపుతారు. ఎక్కువ ఆక్సీజన్ పీల్చుకుంటే ఆరోగ్యం చేకూరుతుంది. కానీ కార్బన్ డై ఆక్సైడ్ సత్వరం వదిలేయాల్సిన వాయువు. శరీరంలోని జీవన క్రియల్ని నిర్వర్తించడానికి మొత్తానికి మొత్తంగా శారీరక ధర్మాల్ని పర్యవేక్షించడానికి మెదడుకు ఎక్కువ రక్తం అవసరమౌతుంది. శరీరానికి అందే ఆక్సీజన్ లో 20 శాతం మెదడే ఉపయోగించుకుంటుంది. యోగా చేసేప్పుడు మెదడుకు తగినంత ఆక్సీజన్ అందదు. అందుకే మెదడు స్తబ్దుగా అయిపోయి, భ్రమలు కలగడం ప్రారంభమౌతాయి. అలాగే సుష్టుగా భోజనం ముగించాక చూడండి ఒళ్ళంతా బరువుగా, బద్ధకంగా, స్తబ్దుగా ఉంటుంది. అలా ఎందుకూ అంటే -- జీర్ణాశయం నిండిన ఆహారాన్ని జీర్ణం చేయడానికి ఎక్కువ మొత్తంలో రక్తం జీర్ణవ్యవస్థకు చేరుతుంది. ఫలితంగా మెదడుకు ఆక్సీజన్, రక్తప్రసరణా తాత్కాలికంగా తగ్గుతాయి. కాలో, చెయ్యో తిమ్మిరెక్కడం అలాంటిదిదే -- రక్త ప్రసరణలో అంతరాయమే- యోగ, ధ్యానం చేయడం వల్ల, సమాధిలోకి పోవడం వల్ల జరుగుతున్నదీ అదే! ఆలోచనల్ని అరికట్టి, మెదడును మొద్దుబారించి, భ్రమల్లోకి, కల్పనల్లోకి పోవడమే!

'శ్వాస మీద ధ్యాస' అని చెపుతారు కొందరు. అంటే ఏమిటీ? కళ్ళుమూసుకుని, శ్వాసమీద ధ్యాస పెట్టి ఇష్టదైవాన్ని తలచుకోవడం. అట్లా అట్లా భ్రమల్ని ఊహల్ని పెంచి పోషించుకుని దైవదర్శనమయ్యిందని సంతృప్తిని పొందవచ్చు. ఈ ఐహిక బంధాల్లోంచి బయటపడి ఒక స్థాయికి ఎదిగి తపస్సు చేస్తే -- ఆధ్యాత్మికశక్తిని సాధించగలమని సాధువులు చుపుతుంటారు. అసలు విషయమేమంటే మెదడుకు తగినంత ఆమ్లజని అందక, కలిగే భ్రమలే అవి! మనకు సాధువులు, మహర్షులు ఉన్నారు. ఇన్నివేల ఏళ్ళలో వీరిలో ఎవరైనా తపస్సు చేసి, వాస్తవంగా దేవుణ్ణి ప్రత్యక్షం చేసుకున్నారా? తమ దేవుణ్ణి పక్కవారికెవరికైనా చూపించి పరిచయం చేశారా? లేదే -- మెదడును పనికిరాని పదార్థంగా మార్చుకోవడం గొప్పపని కాదు.దాన్ని నిరంతరం వాడుతూ కొత్త కొత్త అన్వేషణలు, ఆవిష్కరణలు చేయడమే మనిషి ధ్యేయం కావాలి. చురుకైన అవయవాన్ని మరింత చురుకుగా చేసుకోవడమే విజ్ఞుల పని!

'జ్ఞాన సాధన పేరుతో మెదడును తిమ్మిరెక్కించి, భ్రమల్లో తేలిపోయి, దివ్య లోకాల సందర్శనం అంటూ, దైవదర్శనమయ్యిందనే భ్రమలో జనానికి తప్పుడు సమాచారమిచ్చేవారిని పిచ్చివాళ్ళకింద జమకట్టాలి.

మహానుభావులెప్పుడూ తోటివారికి పనికొచ్చే పని చేస్తారు. తమను తాము వ్యర్థులుగా మార్చుకునే ప్రక్రియలు చేపట్టరు. జనానికి తప్పుడు దారులు చూపంచరు. వాస్తవంలోనే భవ్యమైన భవితకు దారులు వేస్తారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్ కుమార్ చొరవతో సమయానికి నీట్ పరీక్ష కేంద్రానికి చేరుకున్న విద్యార్థి

జనసైన్యం సిటి

కరీంనగర్‌లో నిర్వహించిన నీట్-2026 పరీక్షకు హాజరయ్యేందుకు వచ్చిన ఓ విద్యార్థి పరీక్ష కేంద్రానికి ఆలస్యమవుతుండగా, విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కుమార్ వెంటనే స్పందించి సహాయం అందించారు. విద్యార్థి పరీక్ష కేంద్రం అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సమయానికి చేరుకునేలా ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రిస్తూ, అవసరమైన మార్గదర్శకత్వం అందించి సకాలంలో పరీక్ష కేంద్రానికి చేర్చారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ కుమార్ చూపిన అప్రమత్తత, మానవతా దృక్పథాన్ని విద్యార్థి కుటుంబ సభ్యులు, కరీంనగర్ సీపీ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు అవసరమైన సమయంలో సహాయం చేయడం పోలీసుల బాధ్యతలో భాగమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

ప్రపంచ యోగ దినోత్సవాన్ని నిర్వహించిన కొడిమ్యాల వాకర్స్ యూనియన్

కొడిమ్యాల జన సైన్యం న్యూస్.

కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఉన్నత పాఠశాల మైదానంలో ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్ యూనియన్ అధ్యక్షుడు రాపర్తి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ పలువురు యోగాసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నిర్వాహకులు యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ఒత్తిడిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో యువకులు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, వాకర్స్ యూనియన్ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. పాల్గొన్న వారందరూ యోగా సాధన చేసి ప్రపంచ యోగ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

కేజీబీవీలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

కొడిమ్యాల జన సైన్యం న్యూస్.

చొప్పదండి నియోజకవర్గం బోయినపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో యోగా, ధ్యాన కార్యక్రమాలు నిర్వహించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. వారు మాట్లాడుతూ యోగా అనేది శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ప్రాచీన భారతీయ సాధన. ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఒత్తిడి తగ్గి మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. శరీరానికి బలం, వశ్యత పెరగడంతో పాటు అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఎం. లింగవ్వ, బోయినపల్లి ఎస్సై రమాకాంత్, పోలీసు సిబ్బంది, యోగా శిక్షకులు శ్రీపతి కృష్ణహరి, బొడిగె అఖిల పాల్గొన్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతిరోజూ యోగా చేయాలని విద్యార్థినులకు సూచించారు.

మిడ్ మానేరు జలాశయంలో నీళ్లు లేక క్రికెట్ ఆడిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు

జనసైన్యం సిటి

కొడిమ్యాల జన సైన్యం న్యూస్.

చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలం కొదురుపాక గ్రామ పరిధిలో ఉన్న రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయాన్ని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. జలాశయంలో నీటి నిల్వలు లేకపోవడంతో ఎండిన ప్రాజెక్టులో నాయకులతో కలిసి క్రికెట్ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిడ్ మానేరు జలాశయం ఎడారిని తలపించే స్థితికి చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా మిడ్ మానేరు జలాశయాన్ని నింపడంతో పాటు మేడిగడ్డ వద్ద కాఫర్ డ్యాం నిర్మించి వివిధ జలాశయాలకు నీటిని తరలించాలని ప్రభుత్వాన్ని కోరారు.

భూ రీసర్వే నిర్ణయం స్వాగతం మే?

పోరెడ్డి దామోదర్ రెడ్డి.

తెలంగాణ భూ రీ-సర్వే కార్యక్రమంపై కొన్ని ముఖ్యమైన సందేహాలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా భూముల రీ-సర్వే నిర్వహించి ప్రతి భూమికి భూదార్ నంబర్ కేటాయించాలని నిర్ణయించడం స్వాగతించదగిన చర్య. అయితే ఈ కార్యక్రమం అమలులో కొన్ని కీలకమైన చట్టపరమైన మరియు ఆచరణాత్మక అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

మొదటగా, ఈ రీ-సర్వే కేవలం ప్రస్తుతం ఉన్న భూ రికార్డులను శాస్త్రీయంగా గుర్తించి, భూముల హద్దులను ఖచ్చితంగా నిర్ధారించడానికేనా? లేక భూమిపై ఉన్న వాస్తవ ఆక్రమణ లేదా స్వాధీనాన్ని ఆధారంగా తీసుకుని పట్టాదారుల హక్కులు, విస్తీర్ణాలను కూడా మార్చనున్నారా? అనేది స్పష్టంగా తెలియడం లేదు.

ఉదాహరణకు, ఒక రైతు పట్టాలో 5 ఎకరాలు ఉండగా, రీ-సర్వేలో అతని స్వాధీనంలో 5.50 ఎకరాలు ఉన్నట్లు తేలితే అదనపు 0.50 ఎకరాలను కూడా అతని పేరుమీద నమోదు చేస్తారా? అదే విధంగా పట్టాలో 5 ఎకరాలు ఉండి, స్వాధీనంలో 4.50 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు తేలితే అతని పట్టా విస్తీర్ణాన్ని 4.50 ఎకరాలకు తగ్గిస్తారా? అనే ప్రశ్నలకు ప్రస్తుతం ఎటువంటి స్పష్టత లేదు.

కేవలం భూమి స్వాధీనంలో ఉందనే కారణంతో పట్టా విస్తీర్ణాన్ని పెంచడం లేదా తగ్గించడం చట్టపరంగా వివాదాస్పదమయ్యే అవకాశం ఉంది. సర్వే ద్వారా భూమి స్థానం, కొలతలు, హద్దులు నిర్ధారించవచ్చు గానీ, యాజమాన్య హక్కులను సృష్టించడం, బదిలీ చేయడం, పెంచడం లేదా తగ్గించడం సాధారణంగా సర్వే అధికారుల పరిధిలోకి రాదు. అలాంటి అంశాలు సంబంధిత చట్టాల ప్రకారం నోటీసులు, విచారణలు, అభ్యంతరాల పరిశీలన మరియు అవసరమైతే న్యాయ నిర్ణయం ద్వారా మాత్రమే పరిష్కారం పొందాలి.

ఇంకొక ముఖ్యమైన అంశం ఏమిటంటే, ప్రస్తుతం అనేక ప్రాంతాలలో సర్వే నంబర్ మొత్తం బయటి హద్దులను మాత్రమే గుర్తించి సర్వే చేస్తున్నారు. కానీ ఆ సర్వే నంబర్‌లోని వ్యక్తిగత పట్టాదారుల భూముల హద్దులను సర్వే చేసి భౌతికంగా గుర్తించడం జరగడం లేదు. ఇది అత్యంత తీవ్రమైన లోపం. ఎందుకంటే

గ్రామాలలో ఎక్కువ భూ వివాదాలు రెండు సర్వే నంబర్ల మధ్య కాకుండా, ఒకే సర్వే నంబర్‌లోని పక్కపక్కన ఉన్న పట్టాదారుల మధ్యే ఉత్పన్నమవుతాయి. ప్రతి పట్టాదారుడి భూమిని విడివిడిగా సర్వే చేసి, జియో-రెఫరెన్స్ చేసి, భౌతికంగా హద్దులు గుర్తించకపోతే భూ వివాదాలు కొనసాగుతూనే ఉంటాయి. అంతేకాకుండా, కేవలం సర్వే నంబర్ బయటి హద్దులను మాత్రమే నిర్ణయించి, లోపలి పట్టాదారుల హద్దులను నిర్ధారించకుండా వదిలేస్తే రైతుల మధ్య ఘర్షణలు పెరిగి గ్రామాలలో శాంతిభద్రతల సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉంది.

అందువల్ల ప్రభుత్వం ఈ క్రింది అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయడం అవసరం:

రీ-సర్వే కేవలం భూ రికార్డుల మ్యాపింగ్ కోసమేనా, లేక హక్కులు మరియు విస్తీర్ణాల మార్పులకు కూడా ఆధారమవుతుందా?

పట్టా విస్తీర్ణానికి మించి ఉన్న స్వాధీనాన్ని గుర్తించి నమోదు చేస్తారా?

పట్టా విస్తీర్ణం కంటే తక్కువ స్వాధీనం ఉన్నప్పుడు పట్టా విస్తీర్ణాన్ని తగ్గిస్తారా?

తుది నిర్ణయానికి ముందు నోటీసులు, అభ్యంతరాలు, విచారణ మరియు అప్పీల్ అవకాశాలు కల్పిస్తారా?

వివాదాస్పద భూములను ప్రత్యేకంగా గుర్తించి తదుపరి నిర్ణయం వరకు పెండింగ్‌లో ఉంచుతారా?

ప్రతి పట్టాదారుడి భూమికి ప్రత్యేక సర్వే, ఉపవిభజన, మ్యాపింగ్ మరియు భౌతిక హద్దుల నిర్ధారణ చేస్తారా?

సివిల్ కోర్టుల తీర్పులు మరియు ప్రస్తుతం ఉన్న హక్కు పత్రాలకు రీ-సర్వేపై ప్రాధాన్యత ఉంటుందా?

భూ రీ-సర్వే కార్యక్రమం శాస్త్రీయంగా, పారదర్శకంగా అమలు చేస్తే భూ వివాదాలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది. అయితే హక్కులపై దాని ప్రభావం ఏమిటి, వ్యక్తిగత పట్టాదారుల హద్దులు ఎలా నిర్ణయిస్తారు, వివాదాలను ఎలా పరిష్కరిస్తారు అనే అంశాలపై ముందుగానే స్పష్టత ఇవ్వకపోతే "భూ వివాదాలు లేని తెలంగాణ" లక్ష్యం పూర్తిగా సాధించడం కష్టమయ్యే అవకాశం ఉంది.